




	ఇఫ్తార్	సెహరి
	ఆదివారం	సోమవారం
కర్నూలు	6:31	5:13
నంద్యాల	6:31	5:13

అహో.. సురభి


'సురభి' బృందంలోని కళాకారిణి

- కళా సౌరభం.. సురభి నాటకం
- కట్టిపడేసే నటనా రాజసం
- రెప్పపాటులో మారిపోయే సెట్టింగులు
- హాస్యం.. ఆహార్యం.. అద్భుత నటన ఆ కళాకారుల సొంతం



సురభి... తెలుగు రాష్ట్రాల ప్రజలకు పరిచయం అక్కర్లేని నాటక సమాజమిది. తరతరాల పాటు కళామతల్లి నొసటన తిలకమై మెరిసిపోతున్నారు. రాజసం ఉట్టిపడే నటన.. అద్భుత హావభావాలు.. కడుపుబ్బా నవ్వించే హాస్యం.. స్పష్టమైన డైలాగ్ డెలివరీ 'సురభి' కళాకారుల సొంతం. 'సురభి' వాళ్లు నాటకాలు వేస్తున్నారంటే... చుట్టుపక్కల పది పల్లెల నుంచి ప్రజలు బండ్లు కట్టుకుని వచ్చి మరీ వీక్షించేవారు. వేదికపై సురభి టీం ప్రదర్శనలు ఇస్తుంటే కనురెప్ప మూసి తెరిచేలోగా సెట్టింగులు మారిపోతాయి. రంగస్థలంపై భారీ సెట్టింగులు, రకరకాల తెరలు సైతం నాటకంలో భాగస్వామ్యం అవుతాయి. ఎన్నో సంభ్రమాశ్చర్యాలను కలిగించే దృశ్యాలు, సెట్టింగులు సురభి సమాజానికే సాధ్యమవుతాయి. వందేళ్లకు పైబడి పౌరాణిక, జానపద నాటకాలను ప్రదర్శిస్తూ సురభి కళాకారులు నాటకరంగాన్ని బతికిస్తున్నారు. బాలనాగమ్మ, పాతాళభైరవి, మాయాబజార్, చింతామణి, శ్రీకృష్ణ లీలలు ఇలా ఎన్నో నాటకాలను సురభి కళాకారులు ప్రదర్శిస్తూ నాటక రంగంలో తమదైన ముద్ర వేసుకున్నారు. కర్నూలు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రదర్శనలు ఇచ్చేందుకు వచ్చిన 'సురభి' కళాకారులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

6లో

రాఘవేంద్రస్వామి ఆశీస్సులతో చరిత్ర సృష్టించాం

- తెలుగు ప్రజలు అగ్రస్థానంలో ఉండాలి
- మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్
- గురు రాఘవేంద్ర స్వామి పట్టాభిషేక వేడుకలకు హాజరు
- గురు వైభవోత్సవ అవార్డు అందజేసిన పీఠాధిపతి


బంగారు రథాన్ని లాగుతున్న పీఠాధిపతి, మంత్రి నారా లోకేశ్, తిక్కారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, బీటీ నాయుడు

మంత్రాలయం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దివ్య ఆశీస్సులతో రాష్ట్రంలో చరిత్ర సృష్టించామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. శ్రీగురు రాఘవేంద్రస్వామి 404వ పట్టాభిషేక మహోత్సవానికి శనివారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆధ్వర్యంలో జరిగిన పట్టాభిషేకం పూజల్లో పాల్గొని భక్తులనుద్దేశించి ఆయన మాట్లాడారు. తెలుగు ప్రజలు అన్ని రంగాల్లో అగ్రస్థానంలో ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆశీస్సులు, దీవెనలు తమపై ఉండాలని, సకాలంలో వర్షాలు బాగా కురవాలని, పంటలు సస్యశ్యామలం కావాలని స్వామివారిని మొక్కుకున్నామన్నారు. మంత్రాలయానికి రావడం రెండోసారి అని, గతంలో పాదయాత్రలో వచ్చినప్పుడు స్వామివారి దర్శనంపై చాలా మంది చాలా విషయాలు చెప్పారన్నారు. అప్పట్లో అభిప్రాయం కోసం తన తల్లి నారా భువనేశ్వరికి ఫోన్ చేశానన్నారు. 'నీ మనసులో ఏమి ఉందో.. అదే పాటించు..' అని ఆమె చెప్పారన్నారు. తన తల్లి చెప్పినమేరకు స్వామివారిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులతో రాష్ట్రంలో చరిత్ర సృష్టించామన్నారు. ఇదిలా ఉండగా రాజకీయ రంగాల్లో విశేష సేవలు చేస్తున్న ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు రాఘవేంద్రస్వామి గురు వైభవోత్సవ-2025 అవార్డును మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన్ను మఠం సంప్రదాయం మేరకు ఘనంగా సత్కరించారు. అనంతరం స్వర్ణ రథానికి పీఠాధిపతి పూజలు చేయగా.. మంత్రి లోకేశ్‌తో పాటు తిక్కారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, బీటీ నాయుడు తదితరులు రథాన్ని ముందుకు లాగారు.

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

గురు వైభవోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు జిల్లా అధికారులు, టీడీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ నవ్య, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఎస్పీ ఉపేంద్రబాబు, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, ఎమ్మెల్యేలు కేఈ శ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, కేఈ ప్రభాకర్, నాగేశ్వరరావు యాదవ్, ఆకేపోగు ప్రభాకర్, పాలకుర్తి శ్రీనివాసరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, పురుషోత్తం రెడ్డి తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



మంత్రి నారా లోకేశ్‌కు గజమాలతో సత్కారం


గురు వైభవోత్సవాల్లో మంత్రి నారా లోకేశ్

ఆయకట్టు రైతుల్లో ఆనందం

- నీటితో కళకళలాడుతున్న గాజులదిన్నె ప్రాజెక్టు
- హంద్రీ నీవా నుంచి రోజుకు 140 క్యూసెక్కులు విడుదల


ప్రస్తుతం ప్రాజెక్టులో చేరిన రెండు టీఎంసీల నీరు

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కళకళలాడుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో రెండు టీఎంసీల నీరు నిలువ ఉంది. కుడి ఎడమ కాలువ ద్వారా రోజుకు దాదాపు 200 క్యూసెక్కుల నీరు జీడీపీ ఆయకట్టు రైతులకు విడుదల చేస్తున్నారు. అలాగే ఎల్లెల్సీ ఆయకట్టు కోడుమూరు సెక్షన్ రైతులకు కూడా నీటిని అందిస్తున్నారు. హంద్రీ నీవా నుంచి ప్రాజెక్టుకు రోజుకు 140 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో రెండు టీఎంసీల మేర నీటి నిల్వ ఉంది. ఈ ఏడాది ప్రాజెక్టు కింద 13000 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇక తాగు నీటి పథకాలైన బండగట్టు (40 గ్రామాలకు తాగునీటి పథకం) డోన్, క్రిష్ణగిరిలకు రోజుకు పది క్యూసెక్కుల నీరందిస్తున్నారు. హంద్రీ నీవా (హెచ్ఎన్ఎస్) నుంచి మార్చి నెల ఆఖరు వరకు నీటి విడుదల ఉంటుందని ఇరిగేషన్ అధికారులు తెలుపుతున్నారు. ఈ ఏడాది సాగు, తాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని తెలుస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో ఇలా...


గత ఏడాది మార్చి 1వ తేదీన ప్రాజెక్టులో నిలువ ఉన్న 0.8 టీఎంసీల నీరు

గత ఏడాది వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు, పెద్దలు తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా ప్రాజెక్టులోని నీటిని వృథాగా కిందకు వదిలి ప్రాజెక్టులో నీరు లేకుండా చేశారు. దీంతో గాజులదిన్నె ప్రాజెక్టు నీరు లేక ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. గత ఏడాది మార్చి 1వ తేదీన ప్రాజెక్టులో 0.8 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. వైసీపీ ప్రభుత్వం కట్ట మరమ్మతుల పేరుతో నీటిని కిందకు వదిలి వేసింది. దీంతో గత ఏడాది ప్రాజెక్టు కింద ఉన్న ఆయకట్టు రైతులు ఒక్క ఎకరం కూడా సాగు చేసుకోలేకపోయారు. చివరకు ప్రాజెక్టు కట్ట పనులు కూడా వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేదు. రూ.27 కోట్లు కేటాయించి నిధులు విడుదల చేయకుండా చేతులెత్తేసింది. దీంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అటు పనులు పూర్తిగాక, ఇటు ఆయకట్టుకు నీరందక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుకు హంద్రీనీవా నుంచి నీటిని విడుదల చేసి నీటిని నిలువ చేస్తూ సాగు, తాగునీటి పథకాలకు ఇబ్బంది లేకుండా చూస్తోంది. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

తొలి రోజు 611 మంది గైర్హాజరు


టౌన్ మోడల్ కాలేజీ పరీక్ష కేంద్రానికి చేరుకున్న ఇంటర్ విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు 611 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలో మొత్తం 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం, జనరల్ ఒకేషనల్ కోర్సుల విద్యార్థులు మొత్తం 23,755 మంది నమోదు చేసుకున్నారు. 23,144 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా.. ఇందులో 611 మంది గైర్హాజరయ్యారు. మొదటి రోజున ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో జిల్లా వృత్తి విద్యాధికారి పరమేశ్వర రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, జిల్లా ఎగ్జామినేషన్ కమిటీ సభ్యులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్ మొత్తం జిల్లా వ్యాప్తంగా 43 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.


శ్రీచైతన్య కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద..

నెలవంక దర్శనం

రంజాన్ మాసం ప్రారంభం



కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభమైంది. ఆదివారం తెల్లవారుజాము నుంచి భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టనున్నారు. శనివారం సాయంత్రం నెలవంక కనిపించడంతో రంజాన్ మాసం ప్రారంభమైనట్లు మతపెద్దలు ప్రకటించారు. రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక ప్రార్థనల కోసం ఇప్పటికే మసీదులు ముస్తాబయ్యాయి. రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలు, ప్రార్థనలు చేస్తారు. ఇది ఆదర్శవంతమైన జీవనానికి ప్రేరణ ఇస్తుందని మతపెద్దలు తెలియజేశారు. ఉపవాసాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలని, అందరూ కలసిమెలసి సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థించారు. రంజాన్ మాసం సందర్భంగా ఉమ్మడి జిల్లాల్లోని మసీదులు ముస్తాబయ్యాయి. నిత్యం ఐదు పూటల నమాజులతోపాటూ ప్రత్యేక పండుగ నమాజ్‌లను నిర్వహించేలా ఆయా మసీదుల మత పెద్దలు ఏర్పాట్లు చేశారు. రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీమ్ కేంద్రాలు కూడా వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ సమయంలో వివిధ రకాల ఫలాలకు ప్రాధాన్యత ఉండగా, ఖర్జూరం, పైనాపిల్, యాపిల్, కర్బూజ, కళింగర, ద్రాక్ష వంటి పండ్లకు బాగా గిరాకీ ఏర్పడింది.

శ్రీగిరిపై ముగిసిన బ్రహ్మోత్సవాలు

- అశ్వ వాహనంపై ఆది దంపతులు
- చివరి రోజున పుష్పోత్సవం, శయనోత్సవం


అశ్వ వాహనంపై స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం శ్రీశైల మహాక్షేత్రంలో ఫిబ్రవరి 19న ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారంతో ముగిశాయి. పంచాహ్నిక దీక్షతో 11 రోజులు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాల చివరి రోజు భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన అశ్వవాహనంపై ఆశీనులను చేసి అర్చకులు, వేదపండితులు విశేష పూజలు జరిపారు. అనంతరం మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, శంఖు, డమరుక నాదాలు, నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు, దేవస్థానం అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పుష్పోత్సవం

అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు పుష్పోత్సవం జరిపారు. కాగడాలు, పసుపు బంతి, పసుపుచేమంతి, తెల్లచేమంతి, నీలంచేమంతి, నందివర్ధనం, గరుడవర్ధనం, మందారం, ఎర్ర ఆస్టర్, నీలం ఆస్టర్, మల్లెలు మొదలైన 21 రకాల పుష్పాలతో విశేషంగా స్వామి, అమ్మవార్లను అర్చించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ఏకాంతసేవ, శయనోత్సవం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం హరికథ, భక్తిరంజని కార్యక్రమాలను నిర్వహించింది. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం భక్తులను అలరించింది.



నృత్యం చేస్తున్న కళాకారులు

తుంగభద్ర

సాహిత్యం



తెలుగుదనం ఉట్టిపడే..
పుల్లంపేట జరీ చీర

భాషలో తెలుగుదనం, తెలుగు జన జీవితం ఉట్టిపడేలా రచన చేయడంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి అగ్రగణ్యులు. ఆధునిక కథకు గురజాడ అప్పారావు బీజం వేస్తే తర్వాతి కాలంలో శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జవసత్వాలు కల్పించారు. తెలుగు కథను ఆధునికత వైపు, వ్యవహారిక భాష వైపు నడిపించిన వైతాళికుడు. చక్కని గ్రామీణ నేపథ్యంతో కథలు రాయడంలో ఆయన నేర్పరి. శ్రీపాద రచించిన 45 కథలను 'పుల్లంపేట జరీ చీర' అనే పేరుతో కథా సంకలనం చేశారు. పుస్తకం ముఖ చిత్రంపైనే 'ప్రతి తెలుగువాడు తప్పక చదవాల్సిన కథలు' అని ఉంటుంది.

ఈ సంపుటిలోని కథలన్నీ చదివాక ఆ మాట తప్పక నిజమనిపిస్తుంది. ఇందులో ప్రతి కథలోనూ ఒక మంచి విషయాన్ని చెప్పారు. సంఘ సంస్కరణ, అవినీతి, అక్రమాలు, అంటరానితనం మీద చక్కటి సందేశాన్ని ఇచ్చారు. అగ్రవర్ణాల్లోని పేద బ్రాహ్మణుల జీవితాల నుంచి అట్టడుగు వర్గాల్లోని దళితుల జీవితాలను చక్కగా చిత్రించారు. ఒక కథకు మరో కథకు పోలికే లేదు. ఇంగ్లీష్ చదువు గొప్పదనాన్ని ఆ చదువు వల్ల వచ్చే సమాజంలో హోదాను గురించి శ్రీపాద గారు ఆనాడే తన కథలో చెప్పారు. మొదటి కథ సాగర సంగమంలో దళితుల మధ్య ఉన్న వ్యత్యాసాలను, పేదరికాన్ని గురించి చెప్పారు. ఒక పాత్ర చేత 'కూడు లేకపోయినా బతకవచ్చు... కానీ కులం లేకపోతే ఎలాగా' అని కులాభిమానం ఉన్న వ్యక్తి అంటే మరో పాత్ర చేత 'కులం కూడు పెట్టదు.. నీడనివ్వదు' అని చెప్పిస్తాడు. లీగల్ అడ్వైజ్ అనే కథలో చాడీలు చెప్పుడు మాటలను విని నమ్మకస్తులను కోల్పోయిన రాజావారి మనసును గురించి చెప్పారు. పుల్లంపేట జరీ చీర శీర్షిక కథలో భార్యాభర్తల అనుబంధాన్ని గొప్పగా చెబుతారు. పేద గుమస్తా ఖర్చులన్నీ తగ్గించేసి భార్యకు పుల్లంపేట జరీ చీరను కానుక ఇచ్చాడు. కన్యాశుల్కం వరశుల్కం అనే కథలో ఆడవాళ్లు కూడా చదువుకోవాలి, సొంత కాళ్ల మీద నిలబడాలనే సందేశాన్ని ఇస్తాడు రచయిత. 'అక్క చదువుకుంటే ఏమవుతుంది. బావని రానీ నించోబెట్టి అడుగుతాను' అని ఒక పాత్ర చేత చెప్పిస్తాడు. ఇదే కథలో ఆడపిల్లలను ఆట వస్తువులాగా అమ్మడం, ఉద్యోగం వచ్చిన కొడుక్కి ఎక్కువగా వరకట్నాన్ని గుంజడం లాంటి వ్యక్తుల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించాడు. తెనుగు రక్తం చెప్పబడిపోతోంది అనే కథలో చిన్న ఉద్యోగాల నుంచి వచ్చిన వ్యక్తుల నుంచి లంచాలను జలగల్లా పీల్చే పెద్ద అధికారుల మనస్తత్వాన్ని చక్కగా చిత్రించారు. ఒక తరానికి మరో తరానికి ఉన్న అంతరాన్ని తెలియజేశారు. వృత్తి వేరు.. గుణం వేరు.. మంచి చెడ్డ నడవడికలో ఉంటుందే కానీ వృత్తిలో లేదని చెప్పిస్తాడు. దేశ దేశాల వాళ్లు మన దేశానికి వచ్చి వ్యాపారాలు చేసుకుని బాగుపడుతుంటే మన తెలుగు వాళ్లు మాత్రం గుమస్తాల్లాంటి చిన్న ఉద్యోగాల కోసం వెంపర్లాడటం గురించి చాలా చక్కగా చెప్పారు. ఇరువురు ఒకటే చోటికి పోదాము అనే కథలో జగ్గారెడ్డి, వెంకమ్మ మధ్య స్వచ్ఛమైన ప్రేమను కళ్లకు కట్టినట్లు చూపించారు.


స్థూలంగా చెప్పాలంటే శ్రీపాద కథలు తేట తెలుగులో సూటిగా ఎదుట కూచొని మాటలు చెప్పినట్లు ఉంటాయి. కాగితం మీద కథలు రాయడం అంటే అమ్మ లాలించి గోరు ముద్దలుగా తినిపించినట్లు ఉంటాయి. ఆయన కథలు మన సాంస్కృతిక స్థాయిని ఎత్తిపడతాయి. మన ఆలోచనల్ని బాగు చేస్తాయి. మన సంస్కారాన్ని ఉన్నతీకరిస్తాయి. మన సామాజిక అవగాహనను మానవీయంగా, ప్రగతిశీలంగా తీర్చిదిద్దుతాయి. శ్రీపాద కథలు చదవడం ఒక అద్భుతమైన కాల్పనిక అనుభవం. ఆయన కథలు రాసి మూడు తరాలు గడిచినా, ఇప్పటికీ తాజాగా, ఉదాత్తంగా మనల్ని తట్టి లేపుతాయి.



మానుక్రింది వెంకటేష్,
తెలుగు ఉపాధ్యాయుడు,
అక్షరశ్రీ మోడల్ హైస్కూల్, ఆదోని

యువకలం

సీమ రాజసం



రాయలసీమ రాజసం అతను
రాయలనాటి పాలెగాళ్లలో
ఒకరు
రణభూమిన తలదించని
వీరుడతను
తెల్లదొరలకు భయాన్ని
పరిచయం చేసిన ధీరోదాత్తుడు
అతడే మన వీర నరసింహుడు..!

రూపనగుడిన పుట్టిన బిడ్డడు
పౌరుషాన్ని ఉగ్గుపాలతో తాగిన
బాలుడు
మెలితిప్పిన మీసంలో ధీరత్వాన్ని
చూపిన ధైర్యవంతుడు
తాడిత పీడిత ప్రజల పక్షాన నిలిచిన
ధీరుడు
చీకటి బతుకుల్లో వెలుగు నింపిన
ప్రజ్వలిత సూర్యుడు
ఉరికొయ్యలను
ముద్దాడిన చారిత్రక
పురుషుడు
అతడే మన వీర
నరసింహుడు...!!

రవి అస్తమించని
సామ్రాజ్యాన్ని
గడగడలాడించాడు
అపర చాణిక్యుడిగా
యుద్ధతంత్రాన్ని
నడిపించాడు
గ్రామ సీమల్లో,
కొండకోనల్లో అంతటా
ఆయన నామస్మరణం
సైరా నరసింహారెడ్డి అంటూ...
ఆనాడు అయింది ప్రతినోటా ఒక జనపద
గీతం
అతడే మన వీర సరసింహుడు...!!
కుట్రలు ఎరుగని సహృదయవంతుడు
కుతంత్రాలు తెలియని మహనీయుడు
తన ప్రేమను పంచుకున్నవారే చివరికి
తనను బ్రిటీషు ముష్కరులకు
పట్టించినా...
చిద్విలాస మూర్తిలా చిరునవ్వులు
నవ్వుతూ
ఉరికొయ్యనెక్కిన యోధుడు...
అతడే మన ఉయ్యాలవాడ
నరసింహారెడ్డి..!!



- టి. ఉషారాణి, బీఎస్సీ,
కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, కర్నూలు.

నగరంలో నేడు

- నగర శివారులోని మామిదాలపాడులో వెలసిన గోదారంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం ఉదయం 9 గంటలకు దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమాలకు ముగ్గురు పీఠాధిపతులు హాజరవుతున్నట్లు దేవస్థానం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త తెలిపారు.
- నగరంలో రోజా వీధిలో చారిత్రక రోజా దర్గాలో కొనసాగుతున్న ఉరుసు మహోత్సవాల్లో ఆదివారం ఉదయం 9 గంటలకు మొక్కులు చెల్లింపు కార్యక్రమం ఉంటుందని దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదాబాషా ఖాద్రి తెలిపారు.
- నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల్లో ఆదివారం ఉదయం 10 గంటలకు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 66వ పుణ్యతిథి కార్యక్రమం, 29వ గాడిచర్ల పురస్కార ప్రదానోత్సవం ఏర్పాటు చేసినట్లు గాడిచర్ల ఫౌండేషన్ సంస్థ అధ్యక్షుడు కేసీ కల్కూర తెలిపారు.
- నగరంలోని సీక్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు దివంగత సంగీత గురువు దాసరి రంగముని జ్ఞాపకార్థం 'స్వర దాసరి వారి స్వర తరంగాలు' పేరుతో శాస్త్రీయ సంగీత, నృత్య ప్రదర్శనలు, సంస్మరణ సభ ఏర్పాటు చేసినట్లు రంగమాధురి కళానిలయం నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు.



కవితలకు ఆహ్వానం

'యువకలం' శీర్షికకు యువకవుల నుంచి 15 లైన్లకు మించకుండా కవితలను ఆహ్వానిస్తున్నాం. కవితలను పంపవలసిన చిరునామా... **'యువకలం' శీర్షిక, ఆంధ్రజ్యోతి (దినపత్రిక), ఇండస్ స్కూల్ పక్కన, గుత్తి రోడ్, పందిపాడు గ్రామం, కర్నూలు.**



అహో.. సురభి

- కళా సౌరభం.. సురభి నాటకం
- కట్టిపడేసే నటనా రాజసం
- రెప్పపాటులో మారిపోయే సెట్టింగులు
- హాస్యం.. ఆహార్యం.. అద్భుత నటన వారి సొంతం
- 140 ఏళ్లు పూర్తి చేసుకున్న నాటక సమాజం
- నేడు ఆదరణ కరువై తెరచాటుకు...

కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 'మాయాబజార్' నాటకంలో ఘటోత్కచుడు పాత్రధారి 'వివాహ భోజనంబు..వింతైన వంటకంబు..వియ్యాల వారి విందు..అహ్హహ్హ నాకే ముందు' అంటూ లడ్డుల బేషన్‌పై చేయి పెట్టి తిప్పగా ఒక్కో లడ్డూ గాల్లో లేస్తూ ఘటోత్కచుని నోట్లోకి వెళుతుంది. 'శ్రీకృష్ణ లీలలు'లో వసుదేవుడు బాలకృష్ణుడిని తీసుకొని వెళ్తుండగా యమునా నది రెండుగా చీలి దారి ఇస్తుంది. మెరుపులు, ఉరుములు కళ్లముందే ప్రేక్షకులకు కానవస్తాయి. ఇదంతా సినిమాల్లో అనుకుంటే పొరపాటే. సినీమా రంగంకన్నా ముందే ఇలాంటి ఎన్నో సాంకేతిక పరిజ్ఞానం కలబోసి వీక్షకులను మెప్పించిన ఘనత సురభి కళా సమాజానిది. ఒకప్పుడు సినిమాలాగే టికెట్ పెట్టి మాత్రమే చూడగలిగే ఏకైక నాటకాలు సురభి నాటకాలే. ప్రేక్షకులను నవరసాల్లో తేలియాడించి, ఒక చక్కని అనుభూతిని కలిగింపజేసే సురభి నాటక ప్రస్థానానికి 140 ఏళ్లు. ఎనిమిది తరాల వారసత్వాన్ని కాపాడుకుంటూ ఈ కళాసమాజాలు నేటికీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నాయి. తెరవెనుక ఎన్ని కష్టనష్టాలున్నా, తమ జీవనాలు దయనీయంగా సాగుతున్నా, ముఖానికి రంగేసుకున్నాక, సర్వం మరిచిపోయి, తెరముందు వినోదాల విందును అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన శిశువు మొదలు వృద్ధాప్యంలో ఊతకర్రతో తారాడే వయోవృద్ధుల వరకు ఆయా వయసులకు తగ్గట్టు పాత్రల్లో వారు జీవిస్తారు. అందుకే సురభి కళ వందేళ్లకు పైగా ప్రవర్ధిల్లుతోంది. తాజాగా రెండు రోజులుగా టీజీవీ కళాక్షేత్రంలో సురభి నాటకోత్సవాలు ప్రేక్షకులను అలరింపజేశాయి. ఈ నేపథ్యంలో సురభి కళాకారులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

రాయలసీమలోనే సురభి సమాజం పుట్టుక

ప్రపంచ ఖ్యాతి పొందిన సురభి నాటక సమాజాల పుట్టుక రాయలసీమలోనే జరిగింది. 1885లో కడపజిల్లా చక్రాయపేట మండలం, సురభి రెడ్డివారిపల్లెలో శ్రీ శారదా వినోదిని నాటక సభను మొట్ట మొదట ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఈ సంస్థ విస్తరించి 50 వేర్వేరు బృందాలుగా వృద్ధి చెందింది. ప్రతి బృందంలో 30 మందికి పైగా సభ్యులతో స్వయంగా నాటకాలు వేసేవారు. అలా ఆ కుటుంబంలో సురభి బాబ్జీ కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు కూడా అందుకున్నారు. ప్రస్తుతం ఆయా సమాజాలన్నీ అంతరించిపోగా, నాలుగైదు సమాజాలు మాత్రమే ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో తమ ప్రదర్శనలు ఇస్తున్నాయి. అందులో ఒకటిగా శ్రీ సాయి సంతోషి సురభి నాట్యమండలి ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో అనేక ప్రదర్శనలతో ముందుంటోంది.

ప్రత్యేకంగా ప్రోత్సహించాలి



భారీ సెట్టింగులు, 30 నుంచి 40 మంది కళాకారులతో సురభి నాటక ప్రదర్శనలు ప్రత్యేకంగా నిలుస్తాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సురభి కళను ప్రత్యేకంగా గుర్తించాలి. ఇటు సినిమా, అటు టీవీ ప్రభావంతో శత వసంతాలు దాటిన సురభి సమాజాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దినదిన గండంగానూ మా పరిస్థితి కొనసాగుతోంది. ఈ వృత్తిని వీడిపోలేక, ఈ కళను తెరచాటుకు తోసివేయలేక ఎన్నో తిప్పలు పడి నాటకాలు వేస్తున్నాం. వివిధ ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖలు మాకు ప్రోత్సాహం ఇవ్వాలని ఎదురు చూస్తున్నాం.
- సురభి సంతోష్, నాటక ప్రదర్శనల కోఆర్డినేటర్

ఒక్కో నాటకానికి రెండు లారీల సామగ్రి అవసరం


సురభి నాటకం అంటే ప్రతి సీన్‌కు ప్రత్యేక సెట్టింగ్ ఉండాల్సిందే. అందుకు కావాల్సిన సామగ్రిని వారే సమకూర్చుకుంటారు. అలా ఒక నాటకం ప్రదర్శనకు సుమారు 2 లారీలతో ఈ కళాకారులు 30 మందికి పైగా పట్టే మరో వాహనంలో ప్రదర్శనలకు బయల్దేరుతారు. అలాగే ఆయా పాత్రలకు కావాల్సిన దుస్తులు, ఆహార్యం (మేకప్) ఎవరికి వారే సమకూర్చుకుంటారు. ఖరీదైన వస్త్రాలు, మేకప్‌లకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఒకప్పుడు సంచార జీవనం సాగించే సురభి నాటక సమాజాలు పిల్లల చదువుల రీత్యా ప్రస్తుతం ఒక ప్రాంతంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాల్సి వస్తోంది. అలాగే వివిధ వృత్తి, ఉద్యోగాలు చేసుకుంటూనే ఈ నాటకాలను ప్రదర్శిస్తున్నారు.

వారసత్వంగా వస్తోంది

సురభి నాటకాలను మా వారసత్వ సంపద. ప్రస్తుతం 8వ తరం నడుస్తోంది. మా పూర్వీకులు కడప జిల్లా నుంచీ తమ కళాప్రదర్శనలు ప్రారంభించారు. సినిమా, టీవీలు వచ్చాక మాకు కొంత ఆదరణ తగ్గింది. ప్రభుత్వం సహకారం అందిస్తే మళ్లీ పూర్వవైభవం వస్తుంది. ఇతర వర్గాలకు ఇస్తున్నట్లే సురభి నాటక కళాకారులను గుర్తించి వారికి ఇంటి స్థలాలు, పింఛన్లు కల్పిస్తే బాగుంటుంది.
- సురభి కొండలరావు, అధ్యక్షుడు, శ్రీసాయి సంతోషి సురభి నాట్య మండలి



మేకప్ వేసుకుంటున్న కళాకారుడు



సురభి నాటకంలోని ఓ దృశ్యం

ఇక్కడే పుట్టాం.. ఇక్కడే జీవిస్తున్నాం

మా నాన్నగారు సురభిలోనే నటించారు. ఆయన వారసత్వంగా మా కుటుంబం అంతా సురభిలోనే పుట్టి, సురభిలోనే పెరిగింది. వివాహం, పిల్లలు, వారి జీవితం కూడా ఇక్కడే కొనసాగుతోంది. ఇది ఒక వారసత్వ పరంపరగా భావిస్తూ, ఈ కళారంగాన్ని బతికించుకోవాలనే ప్రయత్నంతో సాగుతున్నాం. టీవీల్లో అవకాశాలు వచ్చినా అక్కడ కొన్ని సాంకేతిక సమస్యలు, నిబంధనలతో వెళ్లలేకపోతున్నాం. - ఆర్.రామలక్ష్మి, సీనియర్ నటి

కళలను ఆదరించాలి



నా బాల్యంలో భక్త ప్రహ్లాద నాటకం ద్వారా రంగప్రవేశం చేశాను. మా నాటకాలకు మేమే స్క్రిప్టులు, పద్యాలు, డైలాగులు రాసుకుంటాం. ఒకే కుటుంబం కావడంతో వ్యక్తిగత భేదాభిప్రాయాలు అంటూ ఏమీ ఉండవు. నటనపై ధ్యాస తప్ప మరొకటి తెలియదు. మా పిల్లలను బాగా చదివిస్తున్నాం. భవిష్యత్తులో ఈ కళను కాపాడుకుంటూనే పిల్లలను ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేలా చేయాలనేది మా ఆశ. మనకు తొలుత తోలుబొమ్మలాటలు, తర్వాత నాటకాలు, రేడియో, సినిమాలు, టీవీ, ఇంటర్నెట్ ఇలా అనేక మాధ్యమాలు వచ్చేశాయి. కానీ మహిళలు కేవలం టీవీ సీరియళ్లకే పరిమితం అవుతున్నారు. పౌరాణిక, చారిత్రక నాటకాల వల్ల అనేక అంశాలు తెలుస్తాయి. మహిళలు సురభి నాటకాలను ఆదరించాలి. - హారిక, యువ కళాకారిణి

సురభి నాటకాలకు ప్రత్యేక స్థానం



140 ఏళ్ల చరిత్రగల సురభి నాటక సమాజాలకు చాలా గొప్ప పేరే ఉంది. భారత దేశంలో సురభి లాంటి నాటక సమాజాలు ఎక్కడా కానరావు. సురభి కళ మన రాష్ట్రానిదై, ప్రత్యేకించి రాయలసీమకు చెందినదై ఉండడం విశేషం. సురభి సమాజాలకు అంతంత మాత్రమే చేయూత లభిస్తున్నా, ఉన్న ఆసరాతోనే బతుకుతూ అనేక కష్టనష్టాలకు ఓర్చుతూ ముఖంపై నవ్వు చెరిగిపోనీకుండా తమ వారసత్వ కళను బతికించుకోవాలనే వారి తపన మహోన్నతంగా నిలుస్తోంది. అందుకే రెండు రోజుల పాటు ఉచితంగా ఈ నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేశాం. రాబోయే రోజుల్లోనూ సురభి కళాకారులకు తగిన ప్రోత్సాహకాలు కళాక్షేత్రం పక్షాన అందజేస్తాం.
- పత్తి ఓబులయ్య, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, కర్నూలు

చెంచుగూడేల్లో అక్షర దీపం

- భక్తకన్నప్ప గురుకులానికి 50 ఏళ్లు
- ఐదు ఎకరాల స్థలంతోపాటు వసతి భవనం నిర్మించిన జీ పుల్లారెడ్డి
- చెంచుల్లో అక్షరాస్యత కోసం కృషి చేస్తున్న సేవా భారతి
- నేడు సిల్వర్ జూబ్లీ వేడుక





గురుకులంలో చదువుకుంటున్న గిరిజన చిన్నారులు

ఆత్మకూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చెంచులకు చదువు చెప్పడానికి ఏర్పాటు చేసిన భక్త కన్నప్ప గురుకులం 25 ఏళ్ల కింద ఏర్పాటైంది. ఇప్పుడు ఈ పాఠశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకుంటోంది. శ్రీశైలంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ.. ఉద్యోగ విరమణ పొందిన దివంగత మల్లికార్జునశర్మ 1999 నవంబర్ 18న శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రంలో సేవాభారతి స్వచ్ఛంద సంస్థ సహకారంతో భక్త కన్నప్ప చెంచు గురుకుల పాఠశాల (సోమేపల్లి సోమయ్య వనవాసి వికాస సేవా కేంద్రం) స్థాపించారు. 15 మందితో ఈ పాఠశాల ప్రారంభమైంది. కొత్తపల్లి, ఆత్మకూరు, పాములపాడు, వెలుగోడు, రుద్రవరం, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లో వున్న చెంచుగూడేలకు అందుబాటులో ఉండటానికి కొత్తపల్లి మండలంలోని గోకవరం గ్రామంలో ఏర్పాటు చేశారు. సేవాభారతి స్వచ్ఛంద సంస్థతో పాటు ప్రముఖ మిఠాయి వ్యాపారి గుణంపల్లి పుల్లారెడ్డి దీనికి పూర్తిగా సహకరించారు. దీని కోసం ఆయన ఐదు ఎకరాల స్థలం ఇచ్చారు. సొంత డబ్బుతో భవనాలు నిర్మించి 2002 డిసెంబర్ 14న ప్రారంభించారు.

ప్రకృతి వ్యవసాయంలో తర్ఫీదు

భక్తకన్నప్ప గురుకులంలో చెంచు చిన్నారులకు 1నుంచి4వ తరగతి వరకు చదువు చెబుతారు. ఆ తర్వాత గోకవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సదుపాయాలను సేవాభారతి స్వచ్ఛంద సంస్థ సమకూరుస్తుంది. విద్యార్థులకు కంప్యూటర్, చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తారు. ప్రకృతి వ్యవసాయంలో తర్ఫీదు ఇస్తారు. నంద్యాల జిల్లా పరిధిలోని వివిధ చెంచుగూడేలకు చెందిన 43 మంది చిన్నారులు చదువుకుంటున్నారు. భక్తకన్నప్ప గురుకుల పాఠశాల కేంద్రంగా 13ఏళ్ల పాటు గూడేల్లో సంచార వైద్య శిబిరాల్లో వైద్య సేవలు అందిస్తున్నారు.

చెంచులను అక్షరాస్యులను చేయడమే లక్ష్యం



చెంచులకు అక్షరజ్ఞానాన్ని అందించడం కోసం భక్తకన్నప్ప గురుకుల పాఠశాలను స్థాపించారు. 25 ఏళ్లుగా నిర్విరామంగా చెంచు చిన్నారులకు ఈ పాఠశాల ద్వారా చేయూతనిస్తున్నాం. సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉంది.
- మాయలూరి రఘురాములు, భక్తకన్నప్ప గురుకులం సెక్రటరీ, గోకవరం

చెంచులకు మెరుగైన వైద్య సేవలు



25ఏళ్ల క్రితం రవాణా సదుపాయం అంతంత మాత్రంగానే ఉండేది. భక్తకన్నప్ప గురుకులం తరఫున మేమే సంచార వైద్యశిబిరాల ద్వారా అన్ని గూడేల్లో వైద్యసేవలు అందించాము. క్షయవ్యాధిపై అవగాహన కల్పించి ఉచితంగా పౌష్టికాహారం, మందులు పంపిణీ చేశాం.
-వాసుదేవరెడ్డి, సంచార వైద్యశాల కోఆర్డినేటర్, గోకవరం

వైభవంగా రోజా దర్గా ఉరుసు

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- ఆకట్టుకున్న ఖవ్వాలి



రోజా దర్గాకు చాదర్ తీసుకువస్తున్న నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి

కర్నూలు కల్చరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సుంకేసుల రోడ్డులోని రోజా దర్గాలో వెలసిన హజ్రత్ సయ్యద్ షా ఇస్హాక్ సనావుల్లా ఖాద్రి 535వ ఉరుసు మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో రెండో రోజు శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ ప్రాంతాలకు చెందిన హిందూ, ముస్లిం భక్తులు దర్గాకు విచ్చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొబ్బరికాయలు, పూలు, చాదర్‌లు సమర్పించుకున్నారు. శనివారం రాత్రి జరిగిన పూజా కార్యక్రమాలకు తెలుగుదేశం పార్టీ నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఆయనకు దర్గా కమిటీ ప్రతినిధులు దర్గా లాంఛనాలతో ఘనస్వాగతం పలికారు. దర్గాలో గౌరు వెంకటరెడ్డి బాబావారికి పూల దండలు, చాదర్‌లు సమర్పించారు. అనంతరం దర్గా పీఠాధిపతి సయ్యద్‌షా దాదాబాషా ఖాద్రితో కలిసి గౌరు వెంకటరెడ్డి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా రోజా దర్గా నిలుస్తోందని, ఇక్కడికి విచ్చేస్తున్న హిందూ, ముస్లిం భక్తుల ఆదరణనే అందుకు ఉదాహరణంగా నిలుస్తోందని చెప్పారు. అనంతరం హైదరాబాదుకు చెందిన కళాకారులతో ఖవ్వాలి కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 9 గంటలకు జియారతె ఫాతెహా (మొక్కులు చెల్లింపు) ఉంటుందని దర్గా నిర్వాహకులు తెలిపారు.



రోజా దర్గా వద్ద ఉరుసు మహోత్సవాల సందర్భంగా భక్తుల సందడి

గురు రాఘవేంద్రా నమో నమః

- వైభవంగా ప్రారంభమైన గురుభక్తి ఉత్సవాలు
- అట్టహాసంగా 404వ పట్టాభిషేక మహోత్సవం
- రాఘవేంద్ర స్వామి బంగారు పాదాలకు అభిషేకం
- దేశ నలుమూలల నుంచి తరలి వచ్చిన భక్తులు


రథాన్ని లాగుతున్న భక్తులు

మంత్రాలయం మార్చి 1, (ఆంధ్రజ్యోతి): గుండెల నిండా భక్తి నింపుకుని గురు రాఘవేంద్ర నమోనమహః అంటూ దేశ నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. మంత్రాలయం రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి తమ గురువులైన గురు రాఘవేంద్రస్వామిని స్మరించుకున్నారు. రాఘవేంద్ర స్వామి గురుభక్తి ఉత్సవాల్లో భాగంగా శనివారం మఠం పీఠాధిపతి శ్రీసుబుధేంద్రతీర్థులు మొదటి రోజు రాఘవేంద్ర స్వాముల 404వ పట్టాభిషేక మహోత్సవాన్ని ప్రారంభించారు.

రాఘవేంద్రస్వామి నడిచిన బంగారు పాదుకలను బంగారు మండపంలో బంగారు సింహాసనంపై అధిష్టించి పుష్పాలు, గంగాజలం, బంగారు నాణేలు, ముత్యాలు, పాలతో అభిషేకం చేశారు. బంగారు పాదుకలను పీఠాధిపతి తలపై పెట్టుకుని తన గురుభక్తిని చాటుకున్నారు. అనంతరం బంగారు పాదుకలను బంగారు రథంపై అధిష్టించి పీఠాధిపతులు మహామంగళహారతితో ముందుకు సాగారు. దాసవాన సాహిత్య భజన మండళ్ల ఆధ్యాత్మిక భక్తి గీతాలు, కోలాట నృత్యాలు, వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాలు, చండా వాయిద్యాల మధ్య బంగారు రథం మఠం ప్రాకారంలో ఊరేగుతుండగా భక్తులతో


పాదుకలకు కనకాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మార్మోగింది. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించి బంగారు, వెండి, పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించారు. రాఘవేంద్రస్వామి మహిమలు, జీవిత ఘట్టాలపై పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో దివ్య సందేశాన్ని అందించారు. మూలరాములకు అభిషేకాలు చేసి హారతులు ఇచ్చారు.

వివిధ రాష్ట్రాల భక్తులు పాల్గొనడంతో మంత్రాలయం భక్తులతో కిక్కిరిసింది. కార్యక్రమంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, ఏఏవో మాధవశెట్టి, మాజీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, శ్రీపతాచార్, మేనేజర్ వెంకటేష్ జోషి, ఐపీ నరసిం హమూర్తి, ఈఈ సురేష్ కోనాపూర్, ప్రకాష్ఆచార్, శ్రీహరినాథాచార్, అనంతపురాణిక్, రవి కులకర్ణి, విజయేంద్రాచార్, ద్వారపాలక అనంత స్వామి, సుధీంద్రాచార్, వ్యాసరాజాచార్, రాజాఎస్ అప్రమే యాచార్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

హైదరాబాదు వారి కళాకారులచే కందుల కూచిపూడి నృత్యాలయం బృందం వారిచే నిర్వహించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో అలరించింది. చెన్నైకు చెందిన విద్వాన్ రిత్విక్‌రావు వోకల్ శాస్త్రీయ సంగీతం భక్తులను ఆకట్టుకుంది. వీటిని మెచ్చిన పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు నగదు, ఫలపుష్ప మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బీఎం ఆనందరావు, మాజీ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు, జేపీ స్వామి, అనంతపురాణిక్ పాల్గొన్నారు.

20 నుంచి 25 వరకు సెపక్‌తక్రా వరల్డ్ కప్ పోటీలు

- 40 దేశాలు పాల్గొనే అవకాశం



కర్నూలు స్పోర్ట్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సెపక్‌తక్రా ప్రపంచ స్థాయి పోటీలను ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో నిర్వహిస్తున్నట్లు భారత్ సెపక్‌తక్రా ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు జి. శ్రీనివాసులు తెలిపారు. దీనికి సంబంధించిన పోటీల లోగోను బీహార్ రాష్ట్ర ముఖ్య మంత్రి నితీష్‌కుమార్ లాంచనంగా ప్రారంభించారు. బీహార్ ప్రభుత్వం ఆర్థిక సహకారంతో సుమారు 15 కోట్ల వ్యయంతో ఈ పోటీలను ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్నారని, ఈ ప్రపంచ స్థాయి పోటీలను అఖిల భారత్ సెపక్‌తక్రా సంఘం, బీహార్ సెపక్‌తక్రా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రపంచ స్థాయి సెపక్‌తక్రా వరల్డ్ కప్ పోటీలకు ప్రపంచంలోనే సుమారు 40 దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.

విద్యార్థినికి కలెక్టర్ పరామర్శ


విద్యార్థిని పరామర్శిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు హాస్పిటల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సి.బెళగల్ మండలం పోలకల్ జడ్పీ హైస్కూల్ విద్యార్థిని శ్రీలేఖను శనివారం ఉదయం 6 గంటలకు కలెక్టర్ పి.రంజిత్ బాషా పరామర్శించారు. శుక్రవారం విద్యార్థిని మీద చెట్టు విరిగి పడటంతో గాయాలై కర్నూలు జీజీహెచ్‌లో క్యాజువాల్టీలో చికిత్స పొందుతోంది. విద్యార్థినితో పాటు మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు వివరించారు. విద్యార్థిని కుడి కాలు దెబ్బతిన్నట్లు చెప్పారు. వెంటిలేటర్ ద్వారా క్యాజువాల్టీలో చికిత్స అందిస్తున్నామని చెప్పారు. ఆందోళన చెందవద్దని కలెక్టర్ విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడారు. గాయపడిన విద్యార్థినికి క్యాజువాలిటీలో రాత్రంతా సేవలు అందించిన మెడిసిన్ ఆర్థో విభాగాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డా.మీనుగా శ్రీనివాసులు, డా.అమర్‌నాథ్ రెడ్డి, పీజీలు, నర్సింగ్ సిబ్బంది, అనస్థిషియా టెక్నిషియన్ దినేష్‌ను సూపరింటెండెంట్ అభినందించారు. రోగిని ఆర్ఐసీయూకు షిఫ్ట్ చేసి సేవలు అందిస్తున్నామన్నారు.

న్యాయాధికారులకు శిక్షణా శిబిరం


మాట్లాడుతున్న కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది

కర్నూలు లీగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు, అనంతపురం జిల్లాల న్యాయాధికారులకు శనివారం ఒక్కరోజు ప్రత్యేక శిక్షణా శిబిరం జరిగింది. కర్నూలు ట్రిపుల్ ఐటీలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది న్యాయాధికారులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ఇన్‌చార్జి ప్రధాన న్యాయాధికారి సత్యవాణి, కర్నూలు అదనపు జిల్లా జడ్జి భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య

నందవరం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వరకట్న వేధింపులు తట్టుకోలేక ఆశీర్వాదమ్మ (26) అనే మహిళ శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. నందవరానికి చెందిన ఆశీర్వదమ్మను అదే గ్రామానికి చెందిన మద్దన్నకు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. పెళ్లి అయినప్పటి నుంచి భర్త, ఆయన తల్లిదండ్రులు, బంధువులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఆ బాధ తాళలేక తాను ఇంట్లోనే ఉరి వేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ టికెట్లపై కేసు నమోదు

శ్రీశైలం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల స్పర్శ దర్శనం టికెట్ల గోల్‌మాల్ జరగడంతో దేవస్థానం సీఎస్ఓ శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివారాల్లోకి వెళితే.. ఫిబ్రవరి 14న కొందరు దళారులు భక్తులకు మాయమాటలు చెప్పి నకిలీ టికెట్లు అంటగట్టారు. ఉచిత క్యూలైన్లలో గంటల కొద్ది వేచి ఉన్న భక్తుల వద్దకు వెళ్లి స్వామి వారి స్పర్శ దర్శనం టికెట్లు తమ వద్ద ఉన్నాయని చెప్పారు. దేవస్థానం ఆన్‌లైన్ ద్వారా భక్తులకు విక్రయించే రూ.500 టికెట్ ను నకిలీ టికెట్‌గా తయారు చేసి రూ.900 కు విక్రయించ్చి సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో ఎప్పుడో జారీ చేసిన టికెట్లపై తేదీలను మార్చి నకిలీ రబ్బరు స్టాంపులతో విక్రయించారు.

సాధారణంగా స్పర్శ దర్శనం టికెట్లు ఆన్‌లైన్ ద్వారా పొందాలంటే ఆధార్ తప్పనిసరి. కొందరు కేటుగాళ్లు ఈ నకిలీ టికెట్లకు ఆధార్ జత చేసి భక్తులకు విక్రయించారు. వీటిపై నిఘా పెట్టిన కొందరు అధికారులు ఈ విషయాన్ని ఈవో ఎం. శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఈ విశషయమై స్థానిక పోలీసు సేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

27 నుంచి ఉగాది మహోత్సవాలు

- మార్చి 20లోపు ఏర్పాట్లు పూర్తి కావాలి : ఈవో


మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు, పాల్గొన్న అధికారులు

శ్రీశైలం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 27 నుంచి 31 వరకు ఐదు రోజులపాటు ఉగాది మహోత్సవాలను నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణపై శనివారం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు కార్యాలయ భవనంలోని సమావేశమందిరంలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణాధికారి, అన్ని విభాగాధిపతులు, పర్యవేక్షకులు, ఉభయ ఆలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. సమావేశంలో ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహించి నందుకు సిబ్బంది అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉగాది మహోత్సవాలకు కర్ణాటక రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికా రులను ఆదేశించారు. ముఖ్యంగా కాలిబాట మార్గంలో వెంకటాపురం, నాగలూటి, దామెర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీముని కొలను, కైలాసద్వారం ప్రాంతాలలో సదుపాయాలు కల్పించాలని అన్నారు. క్యూలైన్లలో ఏర్పాట్లు, క్షేత్ర పరిధిలో తాత్కాలిక వసతి, మంచినీరు, విద్యుద్దీకరణ, వైద్యశిబిరాల ఏర్పాటు, సూచిక బోర్డుల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఏర్పాట్లు చేయాలని ఈవో ఆదేశించారు.

సరిహద్దుల్లో తాగు నీటి వివాదం

- కాలువ అక్రమ తవ్వకాలను అడ్డుకున్న బోర్డు అధికారులు

హాలహర్వి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో తాగునీటి పైపులైన్ నిర్మాణం విషయంలో కర్ణాటక గ్రామస్థులు, టీబీబీ డీఈ హసేన్ బాషా మధ్య వివాదం నెలకొంది. కర్ణాటక రాష్ట్రం యర్రగుడి వద్ద తాగునీటి కోసం జలాశయాన్ని నిర్మించారు. ఇప్పటివరకు నీటితో నింపుకోలేదు. మోటార్ల సహకారంతో నింపుకోవాల్సిన కర్ణాటక ప్రజాప్రతినిధులు అత్యుత్సాహం ప్రదర్శించారు.

ఎర్రగుడి సర్పంచ్ సురేష్ ఎమ్మెల్యే నాగేంద్ర అనుచరుడంటూ ఏకంగా కాల్వనే తవ్వేందుకు శ్రీకారం చుట్టారు. ఎల్లెల్సీ సిబ్బంది అడ్డుకున్న వినలేదు. ఎక్స్‌కవేటర్‌తో పనులు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న ఎల్లెల్సీ బోర్డు డీఈ హసేన్ బాషా సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనుమతి లేకుండా దౌర్జన్యంగా పనులు చేస్తున్నారని కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాగునీటికి తాము వ్యతిరేకం కాదని, అయితే కాలువనే తవ్వుతామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. కర్నూలు జిల్లాకు సైతం తాగునీరు ఇస్తున్నామని, ఇలా దౌర్జన్యంగా కాలవను తవ్వడానికి మాత్రం అనుమతి ఇవ్వబోమని తేల్చి చెప్పారు. చివరకు వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో ఎస్‌వో దుర్గాప్రసాద్ ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులూ లోడ్ క్రమబద్ధీకరించుకోండి

- కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి

కల్లూరు మార్చి1 (ఆంధ్రజ్యోతి): గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు లోడును క్రమబద్ధీకరించుకోవాలని కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. ఏపీఈఆర్‌సీ వినియోగదారులకు స్వచ్ఛంద విద్యుత్ లోడు క్రమబద్ధీకరణకు పథకాన్ని ప్రవేశపెట్టారని ఆయన తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఈ పథకాన్ని ప్రారంభించడానికి మార్గదర్శకాలు జారీ చేసి ఉన్నారని చెప్పారు. గృహ విద్యుత్ వినియోగదారులు తమ అదనపు లోడు క్రమబద్ధీకరణకు డిపార్ట్‌మెంట్ రుసుములో 50శాతం రాయితీతో చెల్లించడానికి ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.ఏపీఎస్‌పీడీసీఎల్.ఇన్ లేదా సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.

అదేవిధంగా డిపార్ట్‌మెంట్‌కు చెల్లించ వలసిన సెక్యూరిటీ డిపాజిట్‌లో ఎటువంటి మార్పు లేదని సూచించారు. ఈ అవకాశం 1 మార్చి 2025 నుంచి 30 జూన్ 25 వరకు ఉంటుదన్నారు. ఈ అవకాశాన్ని గృహ విద్యుత్ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకుని ఒక కిలోవాట్‌కు వెయ్యి రూపాయలు లబ్ధి పొందాలని ఎస్ఈ తెలిపారు.

పశుగణనలో తప్పుడు వివరాలు

- ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు అగ్రికల్చర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న 21వ జాతీయ పశుగణన కార్యక్రమంలో అధికారులు తమ ప్రయోజనాలను కాపాడుకునేందుకు తప్పుడు వివరాలు నమోదు చేస్తున్నారని ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని గోకులం సమావేశం మందిరంలో వెంకటేశ్వర్లు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంపదను వాస్తవంగా ఉన్నదానికంటే ఎక్కువ చేసి తప్పుడు వివరాలు నివేదికలో పొందుపర్చుతున్నారని అన్నారు. భారత ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వుల్లో పశుసంవర్ధక శాఖకు సంబంధించి పశువుల ట్యాగింగ్ కానీ, వ్యాక్సినేషన్ కార్యక్రమాలు కానీ చేపట్టవద్దని అలా చేయడం వల్ల పశుగణన కచ్చితత్వంపై ప్రభావం చూపిస్తుందని స్పష్టంగా ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. పశువుల సంఖ్యతో సంబంధం లేకుండా వంద శాతం వ్యాక్సినేషన్ చేసి ఆ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న సిబ్బందిపై అధికారులు ఒత్తిడి పెంచడం దారుణమన్నారు. తప్పుడు వివరాల నివేదికలో లేని పశువులను కూడా చూపడం వల్ల వాటికి ఏవిధంగా వ్యాక్సినేషన్ చేసినట్లు నమోదు చేయాలో సిబ్బంది అర్థం కాక అయోమయానికి గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా క్షేత్ర స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులపై పని ఒత్తిడి భారాన్ని తగ్గించాలని ఆదేశించారు. సమావేశంలో జేవీవో, వీఎల్‌వో అసోసియేషన్ కార్యదర్శి రంగన్న, వైస్ ప్రెసిడెంటు జనార్దన్ రెడ్డి, ఇతర నాయకులు రాముడు, చంద్ర యాదవ్, వెంకటురమణ, బజారి, సెక్రటరీ సుబ్బరాయుడు, ఇతర సభ్యులు సుధాకర్, రమేష్, స్రవంతి సుభాన్ రామకృష్ణ, నరసన్న పాల్గొన్నారు.

కేఎంసీ సర్జరీ పీజీ విద్యార్థుల ప్రతిభ


సర్జరీ పీజీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): 2025లో జరిగిన పీజీ వైద్య విద్యార్థుల పరీక్షల ఫలితాల్లో కర్నూలు మెడికల్ కాలేజీ పీజీ వైద్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. రాష్ట్రంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. డా.ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ విజయవాడ విడుదల చేసిన ఫలితాల్లో డా.విష్ణు శ్రీకర్ రెడ్డి 613 మార్కులు సాధించి స్టేట్ టాపర్‌గా నిలిచారు. డా.ఏ.తేజేశ్వర రెడ్డి 610 మార్కులతో రెండో ర్యాంకు, డా.పి.వెంకట శివనాగజ్యోతి 602 మార్కులతో మూడో ర్యాంకు సాధించారు. కర్నూలు మెడికల్ కాలేజీ చరిత్రలో ఒకేసారి స్టేట్ మూడు ర్యాంకులు సాధించడం రికార్డుగా నిలిచిందని కేఎంసీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టి నరసమ్మ జనరల్ సర్జరీ హెచ్‌వోడీ డా.పి.హరిచరణ్ వైద్యులను అభినందించారు. మొదటి మూడు స్టేట్ ర్యాంకులు సాధించిన పీజీ విద్యార్థులు మాట్లాడుతూ సూపర్‌స్పెషాలిటీ డిగ్రీ చేసి పేద ప్రజలకు సేవ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ ప్రొఫెసర్లు డా.రామకృష్ణ నాయక్, డా.కోటి రెడ్డి, డా.చక్రవర్తి, డా.మాధవీ శ్యామల, డా.జయరాం వైద్యులు పాల్గొన్నారు.

రుణం తీర్చుకోవడం గొప్ప అవకాశం

- క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి డీవీఆర్ సాయిగోపాల్
- ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): చదివిన కళాశాల రుణం తీర్చుకోవడం గొప్ప అవకాశమని ఉప కులపతి ప్రొఫెసర్ డీవీఆర్ సాయిగోపాల్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో 1971 నుంచి చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా క్లస్టర్ వర్శిటీ ఉపకులపతి మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు కళాశాల సమస్యల పరిష్కారానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామనడం అభినందనీయమన్నారు. రూసా నిధులతో నూతనంగా నిర్మించిన భవనాలకు, కళాశాల వ్యవస్థాపక సభ్యుడైన ముఖ్యదాత పేలాల కొండయ్య పేరు, మహిళా హాస్టల్‌కు వారి సతీమణి పేరు పెడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ కే. వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వై. జయరాజు, కమిటీ కన్వీనరు మల్లికార్జున, పేలాల ప్రేమ్ కుమార్, శివశంకర్ రెడ్డి, మన్సూర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీమఠంలో సంగీత దర్శకుడు కీరవాణి

మంత్రాలయం, మార్చి1 (ఆంధ్రజ్యోతి) రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, తనయులు శ్రీసింహ, కాలభైరవ కుటుంబ సమేతంగా శనివారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనం పూజల్లో పాల్గొన్నారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వీరివెంట సీపీ స్వామి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ అంకెల గారడీ : కాంగ్రెస్

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టి బడ్జెట్ అంతా అంకెల గారడీ అని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కే. జిలానీ బాషా అన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రూ. 3.22 లక్షల కోట్ల బడ్జెట్ అని చెప్పి చరిత్రలో మొదటిసారి అంకెల గారడీ చేశారన్నారు. ఓట్ల కోసం ప్రజలకు హామీలు ఇచ్చి అందలం ఎక్కి కూర్చున్నారని, అమలు చేయకుండా విస్మరించారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఓబీసీ చైర్మన్ డీవీ సాంబశివుడు, ఎస్సీ సెల్ చైర్మన్ బజారన్న, అనంత రత్న మాదిగ, లాజరస్, ప్రమీల పాల్గొన్నారు.

15న రైతు సదస్సును జయప్రదం చేయండి



మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో 15న ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రయ్య, పంపన్నగౌడు, కౌలు రైతు సంఘం కార్యదర్శి తిమ్మయ్య, జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఆర్ భవనంలో వారు మాట్లాడుతూ ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలో ఏపీ రైతు సంఘం జాతీయ మహాసభలు పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారన్నారు. ఈ జాతీయ మహాసభల గౌరవార్థం కర్నూలులో 5వేల మందితో రైతు సదస్సును ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. రైతు సంఘం జిల్లా సమితి సభ్యులు సురేంద్ర యాదవ్, డొడ్డిపాడు బాషా, రాముడు, సహాయ కార్యదర్శి పంపన్నగౌడు, పాల్గొన్నారు.

పూర్ణాహుతితో ముగిసిన బ్రహ్మోత్సవాలు

ఓర్వకల్లు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కాల్వబుగ్గ రామేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా ముగిశాయి. చివరి రోజు శనివారం ఆలయ ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో వేద పండితులు జంధ్యాల ప్రసాద్ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, లక్ష్మీనరసింహ శర్మలు స్వామి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన హోమంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫెస్టివల్ కమిటీ సభ్యులు కాటినేని నారాయణ, కాకి దేవేంద్ర, రామాంజనేయశర్మ, పెద్ద మల్లయ్య, లక్ష్మీదేవి, పార్వతమ్మ, మాతృనాయక్, వరలక్ష్మి, పద్మావతమ్మ, భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తాం


లొద్దిపల్లెలో మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్

ఓర్వకల్లు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): లొద్దిపల్లె గ్రామంలో డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం మండలంలోని లొద్దిపల్లెలో రైతు కమ్మ రాజశేఖర్ గ్రామ డ్రైనేజీ నీరు తమ పొలాల్లోకి వస్తుందని, దీంతో పంటలు పండక తీవ్రంగా నష్టపోతున్నామని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్, డీఎల్‌పీవో లక్ష్మి గ్రామంలో పర్యటించి డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీ నీరు పొలాల్లోకి ఎలా వెళ్తుందనే దానిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీని తొలగించేందుకు రూ.85 లక్షలు ఖర్చు అవుతుందని అధికారులు ఆర్డీవోకు వివరించారు. ఈ నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుబ్బరాయుడు, సర్వేయర్ శంకర్ మాణిక్యం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి

కోడుమూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ అధ్యక్షులు గఫూర్‌మియా డిమాండ్ చేశారు. స్థానిక ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ముందు శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకుల విలీనియంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న రాయలసీమ గ్రామీణ బ్యాంక్‌ను ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకుగా రూప కల్పన చేశారు. రాయలసీమలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని అక్కడే కొనసాగించాలని, మరో చోటికి మార్పులను కోవడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న, నాయకులు రమేష్, బుడ్డప్ప పాల్గొన్నారు.

కామన్ పీజీ సెట్ రద్దు చేయాలి

కర్నూలు అర్బన్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కామన్ పీజీ సెట్‌ను తక్షణమే రద్దు చేయాలని, పీజీ ప్రవేశ పరీక్షలను వర్సిటీలకే అప్పగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, జీవో నెం 77ను తక్షణమే ఉపసంహరించుకోవాలని, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లో ఉన్నత విద్యకు అధిక నిధులు కేటాయించాలని కోరారు. కేంద్ర ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తోందని, పీజీ సెట్ పేరుతో అన్ని యూనివర్సిటీలను ఉమ్మడిగా ప్రవేశ పరీక్షలను నిర్వహించామని, దీని ద్వారా పీజీ విద్యలో ప్రవేశాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ వర్సిటీ కార్యదర్శి రామక్రిష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కే శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతు పనుల్లో భాగంగా నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు టౌన్ ఈఈ శేషాద్రి శనివారం తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు బి. క్యాంపు సెక్షన్ పరిధిలోని సింధూ ఎస్టేట్, మారుతి మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కేంద్రీయ విద్యాలయం, చెక్‌పోస్టు ఏరియా, బీడీవర్కర్ కాలనీ, కళావతినగర్, వాసవీ నగర్ ప్రాంతాల్లో కరెంట్ కోత ఉంటుందని తెలిపారు.

విద్యార్థిని పరామర్శించిన ఎమ్మెల్యే

సి. బెళగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్సుడేను జరుపుకుంటుండగా 7 మంది విద్యార్థులపై చెట్టు విరిగిపడడంతో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి కర్నూల్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థిని శ్రీలేఖను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ నాయకులు శంకర్, మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్, మండల విద్యాధికారి ఆదాంబాషా, ప్రధానోపాధ్యాయులు రమా, ఉపాధ్యాయులు ఉన్నారు.

కబడ్డీ విజేతగా తెలంగాణ జట్టు


కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న దాతలు

ఓర్వకల్లు, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అంతరాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీలకు తెలుగు రాష్ట్రాల నుంచి 60 టీములు పాల్గొన్నాయి. ఈ పోటీల్లో మొదటి విజేతగా తెలంగాణ రాష్ట్రం ముళ్లమల్ల గ్రామం టీం గెలుపొందగా.. దాతలు హుశేన్‌షా, అన్వర్‌బాషా రూ.40వేల నగదును అందజేశారు. రెండో విజేతగా గోనెగండ్ల జట్టు నిలువగా.. రూ.30వేల నగదును ఈవో మద్దిలేటి అందజేశారు. మూడో విజేతగా హుశేనాపురం టీం గెలుపొందగా.. 20వేల నగదును దాత మహ్మద్ హుశేన్ అందజేశారు. ఆర్గనైజర్లుగా సాయి కుమార్, షఫీ, న్యాయ నిర్ణేతలుగా అన్వర్‌బాషా, గజేంద్ర, పరమేష్ వ్యవహరించారు.

పైసలిస్తేనే.. సాగునీరు!



కోడుమూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): చేయి తడిపితేనే రైతులు వేసిన పంటలకు సాగు నీరు... లేదంటే పంటలు ఎండిపోవాల్సిందే. ఎల్లెల్సీ కోడుమూరు సబ్‌డివిజన్‌లో అధికారులు రైతుల నుంచి ఎకరాకు రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూళ్లకు పాల్పడి సాగునీటిని విడుదల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

- రైతుల నుంచి ఎకరాకు రూ.1000 నుంచి 1500 వరకు వసూలు
- ఎల్లెల్సీ సాగు నీరు నాన్ ఆయకట్టుకు మళ్లింపు
- జీడీపీ నీటిని కొల్లగొడుతున్న అధికారులు
- అధికారుల నిర్వాకంతో ఎండుతున్న ఆయకట్టు పంట పొలాలు
- ఆలస్యంగా వసూళ్ల దందా వెలుగులోకి


నాన్ ఆయకట్టుకు అందుతున్న నీరు

కోడుమూరు సబ్‌డివిజన్‌లో రబీ సీజన్‌లో డిసెంబర్ 15 నుంచి ఈ ఏడాది మార్చి చివరి వరకు పంటలకు తడిని అందించాలి. కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కర్నూలు మండలంలోని సుమారు 6వేల ఎకరాలల్లో మొక్కజొన్న, కంది, మిరప, వేరశనగ, కొర్ర, సజ్జ, జొన్న వంటి తదితర పంటలు వేశారు. రైతులు వేసిన పంటలకు సాగునీరు అందిస్తామని ఐఏబీ సమావేశంలో ఉన్నతాధికారులు తీర్మానం చేశారు. అయితే రైతులకు సాగునీటి అందించడంలో ఇక్కడి నీటిపారుదల శాఖ అధికారులు ఘోరంగా విఫలమయ్యారు. సబ్‌డివిజన్‌లో విధులు నిర్వహించాల్సిన డీఈ, జేఈ నుంచి కింది స్థాయి అధికారుల పనితీరు గాడి తప్పిందని రైతులు విమర్శిస్తున్నారు. జలదోపిడి చేసి రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసి పంటలకు నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిసింది. అయితే కొంత మంది రైతులు డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారు. వారు సాగు చేసిన పంటలకు సాగునీరు అందక ఎండుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కాల్వలపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో వర్కూరు గ్రామ సమీపంలోని సుద్దవాగు దగ్గర సాగునీరు భారీగా వృధాగా ప్రవహిస్తోంది.

కృత్రిమ కొరత సృష్టిస్తున్న అధికారులు

కోడుమూరు దిగువ కాలువ సబ్‌డివిజన్‌కు రావాల్సిన నీటి వాటాను రాబట్టడంలో ఇక్కడి అధికారులు విఫలం అయ్యారు. ముందుగా అధికార లెక్కల్లో లేని జీడీపీ, ఎల్లెల్సీ నానాయకట్టు రైతులతో అధికారులు ఒప్పందం కుదుర్చుకొని అరకొరగా వచ్చే నీటిని వారికి సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సబ్‌డివిజన్‌లో విధులు నిర్వహించే అధికారులే ఆయకట్టు రైతులను రెచ్చగొట్టి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఎల్లెల్సీ నీటితో పాటు జీడీపీ నీటిని వాడుకునే విధంగా ప్రణాళికను రూపొందిస్తారు. తప్పని పరిస్థితుల్లో అరకొర వచ్చే ఎల్లెల్సీ నీటితో పాటు జీడీపీ నీటిని వాడుకొని రైతులకు నీరు అందిస్తారు. దీని కారణంగా జీడీపీ ఆయకట్టు రైతులకు సకాలంలో నీరు అందించడం లేదు. ప్రస్తుతం ఎల్లెల్సీ నుంచి 90, జీడీపీ నుంచి 60 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి రైతుల పంటలకు నీటిని అందిస్తున్నారు. నానా ఆయకట్టు రైతులకు నీరు ఇస్తుండడంతో ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదని అధికారులే ముసలికన్నీరు కారుస్తారు.


ఎల్లెల్సీ ఆయకట్టు పొలంలో ఎండుతున్న పొగాకు

ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన వసూళ్ల పర్వం

అధికారుల ఆదేశాల మేరకు కోడుమూరు సెక్షన్ పరిధిలోని 8ఎల్ (పులకుర్తి) కింద ఉన్న రైతుల నుంచి భారీ ఎత్తున రైతుల నుంచి డబ్బులు వసూళ్లు చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత నెల 22న కొంత మంది రైతులు పెద్ద కోడుమూరు సెక్షన్ ఆఫను దగ్గరకు చేరుకొని డబ్బులు దండుకొని తమ పొలాలకు ఎందుకు సాగునీరు ఇవ్వడం లేదని అధికారులను నిలదీశారు. ఇందుకు అధికారులు నీళ్ల నములుతూ త్వరలో నీరు అందిస్తామని రైతులను బుజ్జగించి పంపిన వైనం ఆలస్యంగా తెరపైకి వచ్చింది. రైతుల నుంచి లంచం తీసుకొన్న వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

నాకు తెలియదు

రైతుల నుంచి డబ్బులు వసూళ్ల చేసిన విషయంపై ఎల్లెల్సీ కోడుమూరు సబ్‌డివిజన్ డీఈఈ సుబ్బారాయుడును ఫోన్‌లో వివరణ కోరగా తాను సెలవులో ఉన్నాను. నాకేమి తెలియదని సమాధానం ఇచ్చారు.


లీకేజీ అవుతున్న నీరు


నాన్ ఆయకట్టు పొలాల్లో కళకళలాడుతున్న వరి పంట

నేడు స్విమ్మింగ్ పూల్ పునఃప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కిసాన్‌ఘాట్ డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్ మార్చి 2వ తేదీన పునఃప్రారంభిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు తెలిపారు. శనివారం స్విమ్మింగ్ పూల్ ప్రాంగణంలో డీఎస్‌డీవో పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కారణంగా ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు స్విమ్మింగ్ కోసం సమయం ఏర్పాటు చేశామన్నారు. ఈత కొలను సభ్యత్వం కోసం చిన్నారులు 6 సంవత్సరాలు పూర్తయి ఉండాలన్నారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని డీఎస్‌డీవో తెలిపారు. ఈ అవకాశాన్ని స్విమ్మర్లు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కర్నూలు చెత్త నగరంగా మారుతోంది

కర్నూలు న్యూసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కర్నూలు దుర్వాసనతో, దోమలతో స్వచ్ఛ నగరంగా కాదు.. చెత్త నగరంగా మారుతోందని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి ధ్వజమెత్తారు. శనివారం ఆయనతోపాటు పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.శివారెడ్డి, న్యాయవాది ఆర్.చంద్రశేఖర్, రిటైర్డ్ సబ్ జైలర్ ఎన్.కాడప్ప, పీపీఎస్ఎస్ నాయకులు అన్వర్‌బాషా కలిసి స్థానిక వెంకటరమణ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి చెత్తచెత్తగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నగరంలో రోడ్లపైన కాలువల్లో, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన, దోమతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

మహిళల బైక్ ర్యాలీ


ర్యాలీ చేస్తున్న మహిళలు

కర్నూలు హాస్పిటల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 1 నుంచి 8వ తేదీ వరకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.నిర్మల పిలుపునిచ్చారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత సంస్థ ఆదేశాల మేరకు మహిలా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా శనివారం కలెక్టరేట్ నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలికలందరికీ హక్కులు, సమానత్వం, సాధికారత ఉండాలని ఐసీడీఎస్ పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏసీడీపీవో రేవతి, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీనివాసాచారి, డీసీపీవో శారద, వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ పి.మేరీ, స్వర్ణలత, నాన్ గవర్నమెంటు ఆర్గనైజేషన్స్ కే.శ్రీనివాసులు, మధు, శకుంతల, ఎలిషాబాబు పాల్గొన్నారు.


మంత్రి నారా లోకేశ్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న న్యాయవాదులు

కర్నూలులో హైకోర్టు బెంచ్‌కు కృషి చేస్తున్నా

● మంత్రి నారా లోకేశ్

కర్నూలు లీగల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుకు తాను వ్యక్తిగతంగా చొరవ తీసుకుని కృషి చేస్తున్నానని విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలియజేశారు. శనివారం మంత్రాలయం పర్యటన సందర్భంగా స్థానిక న్యాయవాదుల బృందం టీడీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ ఆధ్వర్యంలో లోకేశ్‌ను కలిశారు. మంత్రి మాట్లాడుతూ కర్నూలుకు హైకోర్టు బెంచ్‌ను ఏర్పాటు చేయడానికి తమ ఎన్నికల మేనిఫెస్టోలో కూడా హామీ ఇచ్చామని, ఇందు కోసం తగిన ఏర్పాట్లు చేయడానికి సంబంధిత అధికారులతో నారా లోకేశ్ సంప్రదించినట్లు కేఈ జగదీష్ తెలిపారన్నారు. ఈ సందర్భంగా కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి నారా లోకేశ్‌కు న్యాయవాదుల సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశామన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ దాశెట్టి శ్రీనివాసులు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్, హైకోర్టు బెంచ్ సాధన సమితి కన్వీనర్ కే.కపిలేశ్వరయ్య తదితరులు ఉన్నారు.

నేటి నుంచి గోదా గోకులంలో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు


పోస్టర్లను విడుదల చేస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని గోదా రంగనాథ స్వామి వారి దేవస్థానం (గోదాగోకుల క్షేత్రం)లో దేవస్థానం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి 8 వరకు నిర్వహిస్తున్నామని గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారం నాగరాజ గుప్త అన్నారు. శనివారం గోదాగోకులంలో బ్రహ్మోత్సవాలకు సంబంధించిన కరపత్రాలు, ఆహ్వానపత్రాలు విడుదల చేశారు. నాగరాజ గుప్త మాట్లాడుతూ ఈ వేడుకలకు ముగ్గురు జీయర్ స్వాములు వస్తున్నారని తెలిపారు. సమావేశంలో గోకులం కమిటీ సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పి. బాలసుధాకర్, టి. శ్రీనాథ్, ఇటిక్యాల పుల్లయ్య, మహిళా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు

● నగర పాలక అధికారులతో మంత్రి టీజీ భరత్ సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వచ్చే వేసవిలో నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మంత్రి నగర పాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్మార్ట్ సిటీకి ధీటుగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రగతి ప్రణాళికలను రూపొందించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత గడువు లోపు తప్పనిసరిగా పూర్తి చేయాలని సూచించారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో కార్పొరేషన్ పరిధిలోని 52 వార్డుల్లో ఎలాంటి తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అవసరమైన ముందస్తు చర్యలను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. పారిశుధ్య పనులను మరింత మెరుగుపరచాలని, కుక్కలకు సంతాన నిరోధక శస్త్ర చికిత్సల రోజువారి సామర్థ్యాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. చెత్త సేకరణ వాహనాల కొరత ఉన్నందున మరమ్మతులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. పూడికతీత పనులు మరింత వేగవంతం చేయాలని, ఫిర్యాదులు రాకుండా ముందుగానే సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సద్వినియోగం చేసుకుని నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తగిన ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు. బీసీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి అర్హులందరికీ అందేలా అధికారులు సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు, అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు ప్రజారోగ్య అధికారి డా.కే.విశ్వేశ్వర రెడ్డి, ఎస్ఈ రాజశేఖర్ ఆర్‌వో జునైద్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్‌వో జునైద్, ఎంఈలు శేష సాయి, సత్యనారాయణ, టీపీఆర్‌వో వెంకటలక్ష్మి, పారిశుధ్య పర్యవేక్షకులు నాగరాజు, సూపరింటెండెంట్లు సుబ్బన్న, స్వర్ణలత, రామకృష్ణ, వాజిద్ పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేస్తాం

● పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ భరత్


పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తామని మంత్రి భరత్ అన్నారు. నగరంలో 13వ వార్డు బంగారుపేటలో శనివారం మంత్రి, నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు పింఛన్‌దారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే 50వ వార్డు కొత్తపేటలో టీడీపీ ఇన్‌చార్జి బోయ మణీష్ నాయుడు ఆధ్వర్యంలో కొత్త పింఛన్‌దారులకు పింఛన్లు పంపిణీ చేశారు..

కల్లూరు: పేద ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని పాణ్యం గౌరుచరిత స్పష్టం చేశారు. శనివారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్ సుంకులమ్మగుడిలో పర్యటించారు. ఎమ్మెల్యే తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డితో కలిసి ఎన్టీఆర్‌భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తం రెడ్డి, కె.పార్వతమ్మ, బి.నాగిరెడ్డి, వార్డు ఇన్‌చార్జి శైలజాయాదవ్, కార్పొరేటర్ జయరాం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

● ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. శనివారం స్థానిక మాధవీనగర్‌లోని తన నివాసంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతులు స్వీకరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే అన్నారు.


పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్: పేదల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. కర్నూలు అర్బన్ మండల పరిధిలో ఉన్న ఎల్‌పేట గ్రామంలో శనివారం మున్సిపాలిటి అధికారులు నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. త్వరలోనే సీఎం చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను సూపర్ సిక్స్ పతకాలను అమలు చేస్తున్నట్లు వివరించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కర్నూలు అర్బన్ మండల పరిధిలోని స్థానిక 38,39,40వ వార్డు క్లస్టర్ ఇన్‌చార్జీ వై.రామేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం సిబ్బందితో కలిసి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులను వృద్ధులకు, వికలాంగులకు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఈశ్వర్‌రావు, మహిళలు సుంకులమ్మ తదితరులు పాల్గొన్నారు.


30వ వార్డు పింఛన్ల పంపిణీలో అర్హులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గూడూరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మండల టీడీపీ అధ్యక్షుడు జె సురేష్ అన్నారు. శనివారం బుడిదపాడు గ్రామంలో లబ్ధిదారులకు ఫించన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతమ్మ, టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి, తిరుపాల్, బంగారు శ్రీనివాసులు, నాగేష్, రాముడు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వీధులతో ఇక్కట్లు


ఆదోని పట్టణంలోని మట్కార్ వాడిలోని ఇరుకు దారి

• ఆదోనిలో 31 ఇరుకు వీధులు.. ప్లాన్లు మంజూరు కాక ఇక్కట్లు • అనుమతికి అవకాశం ఇచ్చిన ప్రభుత్వం

ఆదోని టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఓల్డ్‌సిటీలో చిన్న సందులు, ఇరుకు రస్తాల్లో ఏళ్లక్రితం ఇళ్లను నిర్మించుకున్నారు. ఆదోని మున్సిపాలిటీలో దాదాపు 31 సందులు ఉన్నాయి. ప్రభుత్వ నిబంధన ప్రకారం 30 అడుగుల రస్తా ఉంటేనే ప్లాను మంజూరుకు అవకాశం ఉంటుంది. ఒకవేళ రహదారి వెడల్పు తక్కువ ఉంటే అందులో సగం స్థలం రహదారి విస్తరణకు నిర్మాణదారుడు మున్సిపాలిటీకి ఉచితంగా రిజిస్టర్ చేసి ఇవ్వాలి. అయితే పాతబస్తీలో పేదలు, సామాన్యులు ఉండటంతో స్థలాన్ని ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. ఫలితంగా ఈ ప్రాంతాలలో అక్రమ నిర్మాణాలే ఎక్కువగా ఉన్నాయి.

ఇరుకు రస్తాలే అధికం.. పాత బస్తీ ప్రాంతంలో
పట్టణంలోని వెంకన్న పేట, ఫరీద్‌సాబ్ వీధి, భార్‌పేట, ఖుసీమొహాల్లా, మట్కార్ వీధి, బ్రాహ్మణ వీధి ఇలా చాలా కాలనీల్లో నాలుగు నుంచి ఐదు అడుగుల రాస్తాలే ఎక్కువగా ఉన్నాయి.

సర్క్యులేషన్ ప్యాట్రన్ ప్రకటించిన ప్రభుత్వం
ఇరుకు ప్రాంతాల్లో ప్లానుల మంజూరు కోసం ప్రభుత్వం సీపీ (సర్క్యులేషన్ ప్యాట్రన్) తయారు చేసి స్థానికుల అభిప్రాయాల మేరకు మున్సిపల్ కమిషనర్ అధ్వర్యంలో రహదారి వెడల్పును కుదించి ప్లాన్లు మంజూరయ్యేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అయితే ఈ విషయంలో తీవ్ర జాప్యం కారణంగా పాతబస్తీలో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయి. దంతో మున్సిపాలిటీ ఆదాయాన్ని నష్టపోతోంది.

గృహ రుణాలు కోల్పోతున్నారు



ప్లాను మంజూరు లేక పాత బస్తీ వాసులకు బ్యాంకుల నుంచి గృహ నిర్మాణ రుణాలు అందడం లేదు. సామాన్యులు అధిక వడ్డీలతో అప్పులుచేసి ఇల్లు కట్టుకునే పరిస్థితి. వార్డులో సచివా లయం ఉన్నా, సీపీ ప్లాన్ల తయారులో జాప్యానికి అధికారుల నిర్లక్ష్యమే కారణంగా కనిపిస్తోంది. **- యూసీ మునిస్వామి, బీజేపీ సోషల్ మీడియా కో కన్వీనర్**

సీపీ ప్లానులు తయారు చేయిస్తున్నాం



పాతబస్తీలో మొత్తం 31చిన్న రహదారులను గుర్తించాం. ఇప్పటికే నాలుగు సీపీ ప్లాన్లను తయారు చేశాం. త్వరలో అన్ని ప్రాంతాల్లో చేసేందుకు నోటిఫికేషన్ జారీ చేస్తాం
- కృష్ణ సింగ్, అసిస్టెంట్ సిటీ ప్లానర్

చెత్తతో సంపదపై అవగాహన ఉండాలి

మద్దికెర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీపై కార్యదర్శులకు అవగాహన ఉండాలని ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి సూచించారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సేంద్రియ ఎరువును తయారు చేసి రైతులకు విక్రయిస్తే పంచాయతీకి ఆదాయం సమకూరుతుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని కోరారు. పని చేయని తాగునీటి పథకాలకు మరమ్మతులు చేయాలని తెలిపారు. కార్యదర్శులు శివకుమార్, సుదాకర్, పరమేశ్వరప్ప, హరికృష్ణ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కరిస్తాం


పనులను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్

మద్దికెర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని సాయినగర్ కాలనీలో నీటి సమస్యను పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ అన్నారు. శనివారం సాయినగర్ కాలనీలో జల్‌జీవన్ మిషన్ పైపులైన్ పనులను పరిశీలించారు. ఓవర్‌హెడ్ ట్యాంకు, ఇంటింటికి కొళాయిలు ఏర్పాటు చేశామని, పైపులైన్ల పనులు చేస్తున్నామన్నారు. ఈవో శివకుమార్, వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం


అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్

ఆలూరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించి, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి శనివారం వినతులను స్వీరించి సంబంధిత శాఖలకు పంపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆలూరు బ్రాంచ్ కెనాల్ అధ్యక్షుడు నగరడోణ కిష్టప్ప, కన్వీనర్ అశోక్ యాదవ్, తిమ్మయ్య, నరసప్ప, సురేంద్ర, కొమ్ము రాజు, గుండయ్య, రాము యాదవ్, రమేష్, సోమశేఖర్, హనుమప్ప, నాగరాజు, దేవేంద్ర పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


కమిషనర్‌కు వినతిప్రతం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని/టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో దోమల బాధ ఎక్కువగా ఉండటంతో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ పట్టణ సెంట్రల్ టీమ్ నాయకులు శనివారం మున్సిపల్ కమీషనర్ కృష్ణను కలిసి కోరారు. మురికి కాలువలలో పూడిక తొలగించక పోవడంతో, దోమల బాధ ఎక్కువగా ఉందని అన్నారు. కొన్ని ప్రాంతాలలోని ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, దోమల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వినోద్ కుమార్, రమేష్ ఆచారి, నాగరాజ్, పగడాల కిరణ్, సోహెల్, ప్రశాంత పాల్గొన్నారు.

కూటమిలోకి వలసలు కొనసాగుతాయి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే

ఆదోని టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కూటమిలోకి వలసలు కొనసాగుతాయని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. నియోజక వర్గంలో నిదనపురం, సర్పంచ్ చంద్రశేఖర్, చిన్న పెండేకల్‌కు చెందిన చిలుక జయరాం, గోనబావి మాజీ ఎంపీటీసీ గోవిందు ఆధ్వర్యంలో 75 కుటుంబాల వారు హైదరాబాద్‌లో బీజేపీలో చేరారు. నాయకులు వెల్లల మధుసూదన్ శర్మ, కల్లుపోతుల సురేష్, రంగన్న యాదవ్, రంగస్వామి, విశ్వనాథ్, రాముడు పాల్గొన్నారు.

రీ సర్వేను పక్కాగా నిర్వహించండి: ఆర్డీవో


మాట్లాడుతున్న ఆర్డీవో భరత్ నాయక్

పత్తికొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రీసర్వేను పక్కాగా నిర్వహించడంతోపాటు సర్వేను వేగవంతంగా పూర్తిచేయాలని ఆర్డీవో భరత్ నాయక్ అన్నారు. శనివారం పత్తికొండ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూసిబ్బందితో రీసర్వే అంశంపై సమావేశం నిర్వహించారు. రీసర్వేలో అభ్యంతరాలు వచ్చిన ప్రతి అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యంగా ఫిర్యాదులు అందిన భూములలో సమీప భూయజమానుల సమక్షంలో రీసర్వేలు నిర్వహించాలన్నారు. సర్వేయర్లు అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. తహసీల్దార్లు, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ


విద్యార్థినికి సర్టిఫికెట్ అందజేస్తున్న హెచ్ఎం

ఆదోని అగ్రికల్చర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): పట్టణం లోని మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థిని లాస్య రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌లో ప్రతిభ కనబరించింది. శనివారం హెచ్ఎం మల్లికార్జున అభినందించారు. పీడీలు నరసయ్య, ముజాహిద్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

పత్తికొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవనబండ గ్రామంలో శనివారం ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఎన్టీఆర్ పింఛన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి వారిని పలకరించి, పింఛన్లను అందించారు. వీఆర్‌వో బాషా ఉన్నారు.


పింఛన్లు అందజేస్తున్న శ్యాంబాబు


పింఛన్లు ఇస్తున్న మీనాక్షినాయుడు

పింఛన్లను పంపిణీ చేసిన మీనాక్షి నాయుడు
ఆదోని రూరల్: పేద ప్రజలకు ఇచ్చిన మాట మేరకు సూపర్ సిక్స్‌ను అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడు అన్నారు. శనివారం ఆరేకల్లు గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో 11,515 పింఛన్లు ఉండగా, 11వేల పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.
ఆస్పరి: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. శనివారం మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో పింఛన్లను పంపిణీ చేశారు. గ్రామంలోని చెరువుకు మరమ్మతులు చేయించి నీటి సమస్య తలెత్తకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో గీతావాణి, ఆలూరు మండల కన్వీనర్ అశోక్, శేషాద్రి నాయుడు, కొంక మధు, సతీష్ కుమార్, సాలీ సాహెబ్, నెట్టెప్ప, యుగంధర్, రాజకుమార్, హనుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో ఉద్రిక్తత

• వక్ఫ్ బోర్డు అధికారులతో గ్రామస్థుల వాగ్వాదం


వక్ఫ్ బోర్డు అధికారులతో వాగ్వాదం చేస్తున్న గ్రామస్థులు

హోళగుంద, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లార్తి హజరత్ శేక్షావలి, షాషావలి సాహెబ్ దర్గా హుండీ లెక్కింపును వక్ఫ్ బోర్డు సూపరింటెంట్ షేక్ మహమ్మద్ హుస్సేన్, దర్గా ఈవో ఇమ్రాన్, వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ సోహెల్ శనివారం నిర్వహించారు. వక్ఫ్ బోర్డు అధికారులతో గ్రామస్థులు సర్దార్, మల్లికార్జున, చిదానంద వాగ్వాదానికి దిగారు. పది సంవత్సరాలుగా ఆదాయం తీసుకుంటున్నారని అభివృద్ధి చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్గాలోని సమస్యలు పరిష్కారయ్యే వరకు హుండీ లెక్కించ కూడదంటూ అడ్డుకున్నారు. ట్రైనీ ఎస్సై మహబూబ్ బాషా జోక్యం చేసుకొని గ్రామస్థులతో మాట్లాడడంతో సద్దుమణిగింది. కాగా హుండీ లెక్కింపు గోప్యంగా నిర్వహంచడం గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈవో ఇమ్రాన్‌ను వివరణ కోరగా పోలీసుల సమక్షంలో లెక్కించామని రాత్రి వరకు కొనసాగుతుందన్నారు. డబ్బును బ్యాంకులో డిపాజిట్ చేసి, విజయవాడలోని వక్ఫ్ బోర్డ్ ప్రధాన కార్యాలయానికి తెలియజేస్తామన్నారు. మొత్తం రూ.7,72,650ల నగదు 78 తులాల వెండి వచ్చినట్లు తెలిపారు.

బాధ్యతగా పని చేసినప్పుడే గుర్తింపు

ఆలూరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు బాధ్యతగా పని చేసినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కురవ జయరాం, ఎంఈవోలు కోమలాదేవి చిరంజీవి రెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాలు మంజులమ్మ పదవీ విరమణ చేశారు. ఉపాధ్యాయురాలు బత్తిని మహాదేవమ్మ, మాజీ జడ్పీటీసీ మల్లమ్మ, ఎస్టీవో శ్రీనివాసులు, హెచ్ఎం సుజాత, నాగరాజు, ఖాసిం పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలికి సన్మానం

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన నాయకులు


మంత్రితో రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి


సమస్యలు వివరిస్తున్న వైకుంఠం శివప్రసాద్


లోకేశ్‌ను కలిసిన మీనాక్షి నాయుడు

రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సావిత్రి...
ఆదోని టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రజకుల అభివృద్ధికి ప్రత్యేక నిధిని కేటాయించాలని రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి మంత్రి లోకేశ్‌ను కోరారు. శనివారం మంత్రాలయానికి వచ్చిన మంత్రిని హెలిప్యాడ్ వద్ద కలిసి మాట్లాడారు. కర్ణాటక, తెలంగాణలో మాదిరిగా రజకులకు ఆధునిక దోబీఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు. రజకులకు ఉచిత విద్యుత్‌ను 250 యూనిట్లకు పెంచాలని, రాష్ట్రంలోని దేవస్థానాల పాలక వర్గాలలో రజకులను బోర్డు డైరెక్టర్‌లుగా నియమించాలని కోరారు. బీసీ మంత్రితో పాటు అమరావతిలో కలిస్తే పరిష్కరిస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారని సావిత్రి తెలిపారు.

లోకేశ్‌కు వైకుంఠం శివప్రసాద్, జ్యోతి వినతి
ఆలూరు, మార్చి1 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన ఆలూరు నియోజకవర్గంలో పెండింగ్ ఉన్న వేదవతి, నగరడోణ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు చొరవ చూపాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి మంత్రి లోకేశ్‌ను కోరారు. శనివారం మంత్రాలయానికి వచ్చిన మంత్రిని కలిశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో వేదవతి నగరడోణ ప్రాజెక్టు పనులు నిధులు లేక ఆగిపోయాయన్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే సాగు, తాగు నీటి సమస్యలు ఉండవన్నారు. వర్షాలు కురువక పంటలు సరిగా పండడం లేదని, రైతులు వలసలు పోవలసి వస్తోందన్నారు. నిలిచిపోయిన జాతీయ రహదారి పనులు పూర్తయ్యేలా చూడాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

నారా లోకేశ్‌ను కలిసిన మీనాక్షి నాయుడు
ఆదోని/రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మంత్రాలయంలో కలిశారు. ఉమాపతి నాయుడు, తెలుగు యువత నాయకుడు మారుతి నాయుడు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారే పనికి రావాలి

మద్దికెర, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డులు ఉన్నవారే ఉపాధి పనులకు రావాలని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. శనివారం మద్దికెర, బొజ్జనాయునిపేట గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించారు. 50 మంది గ్రూపుగాపనులకు వెళ్లాలన్నారు. ఎంత పనిచేస్తే అంతే వేతనం వస్తుందని. కూలీలు వలస వెళ్లవద్దని, దివ్యాంగులకు కూడా పనులు కల్పిస్తున్నామన్నారు. మేటీలు అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగి మృతి

చిప్పగిరి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపురం విశ్రాంత రైల్వే ఉద్యోగి రామయ్య గారి మేకల రామాంజినేయులు(65) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన మృతిపట్ల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే విరుపాక్షి, ఎంపీపీ హేమలత మృతుడి భార్య, గ్రామ సర్పంచ్ ఎం.లక్ష్మీదేవికి సానుభూతి తెలిపారు.


రామాంజినేయులు(ఫైల్)

హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం

ఆదోని టౌన్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): నాయి బ్రాహ్మణులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు చిన్న రంగస్వామి అన్నారు. శనివారం మాట్లాడుతూ, కులవృత్తి చేసేవారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆదరణ పథకానికి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం అవుతోందన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు.

బండలాడుగు పోటీల్లో గెలిచిన గార్లదిన్నె వృషభాలు


బండలాగుడు పోటీలు ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శివరాత్రి సందర్భంగా బ్రహ్మగుండంలో శనివారం ఒంగోలు జాతి బండలాగుడు పోటీలను నిర్వహించారు. టీడీపీ నాయకుడు రమాకాంత్‌రెడ్డి, కన్వీనర్ బలరాంగౌడ్, తెలుగు యువత అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, బొమ్మన రాజశేఖర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె రమేశ్ వృషభాలు 4,071 అడుగులు లాగి విజేతగా నిలిచాయి. విజేతలకు యిద్దెం వెంకటరమణ, మదన్‌గోపాల్‌రెడ్డి, గౌండ విజయ్, కేశరెడ్డి నాగార్జునరెడ్డి, రామకృష్ణారెడ్డి నగదు అందజేశారు. మదన్‌గోపాల్‌రెడ్డి, కేశరెడ్డి నాగార్జునరెడ్డి, రామకృష్ణారెడ్డి, ఈదుల వెంకటరాముడు, రామచంద్రుడు, ఇన్‌చార్జి ఈవో హనుమంతరావు, ఈవో ఆంజనేయులు పాల్గొన్నారు.

10న చలో విజయవాడ

ఆదోని అగ్రికల్చర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఈనెల 10న చలో విజయవాడ నిర్వహిస్తున్నట్లు యూనియన్ కార్యదర్శి వెంకటమ్మ కోరారు. శనివారం ఎన్జీవోస్ భవనంలో జిల్లా కమిటీ సమావేశం వరలక్ష్మీ అధ్యక్షతన జరిగింది. గత ప్రభుత్వ హయాంలో తమకు వేతనాలు పెంచాలని 42 రోజుల పాటు దీక్షలు చేపట్టామన్నారు. అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. తిప్పన, రామాంజినేయులు, సరోజా, లలిత, గీత, సోమక్క, శ్రీదేవి కరుణా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటమ్మ

సర్వేలో నిర్లక్ష్యం వద్దు

• డీఎల్‌డీవో అనూరాధ

పత్తికొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సర్వేలో నిర్లక్ష్యం వద్దని డీఎల్‌డీవో అనూరాధ సూచించారు. శనివారం మహిళా పోలీసులు, అంగన్‌వాడీలతో సమీక్ష నిర్వహించారు. శిశు ఆధార్ నమోదు పూర్తి చేసి, ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలన్నారు. ఎంపీడీవో సువర్ణలత ఉన్నారు.

ఆలయంలో చోరీ

ఆస్పరి, మార్చి1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారెమ్మ ఆలయంలో శనివారం చోరీ జరిగినట్లు పూజారి గోవిందు తెలిపారు. హుండీ నగదు సమారు రూ.2లక్షలు, మారెమ్మ అవ్వ తాళిబొట్టు, ముక్కుపుడకను దొంగిలించినట్లు తెలిపారు. పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా చోరీని ప్రాథమికంగా నిర్ధారించామని విచారణ చేసి దొంగలను పట్టుకుంటామని తెలిపారు.

ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు

• మొదటి రోజు పలువురి గైర్హాజరు


ఆదోని ఆర్ట్స్ కళాశాలలో విద్యార్థులు


పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద..

ఆదోని అగ్రికల్చర్, మార్చి1 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. అరగంట ముందే కేంద్రాల్లోకి అధికారులు విద్యార్థులను అనుమతించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. పట్టణంలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో 2,783 మందికి గాను 70 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇన్‌చార్జిలు తెలిపారు.
పత్తికొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో రెండు కేంద్రాలను ఏర్పాటుచేశారు. మొత్తం 368 మంది విద్యార్థులకు గాను 25మంది గైర్హాజర య్యారని ఇన్‌చార్జి నయీమున్నీసా తెలిపారు. సిట్టింగ్‌స్క్వాడ్ శివయ్య పరీక్షల నిర్వహణను పర్యవేక్షించారు.
మద్దికెర: ఆదర్శ పాఠశాలలో 212 మందికి గాను 11 మంది గైర్హాజర య్యారని 201 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని డిపార్టుమెంట్ ఆఫీసర్ కిరణ్మయి తెలిపారు.
దేవనకొండ: జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శనివారం ప్రథమ సంవత్సరం పరీక్షకు 195 విద్యార్థులకు గాను, 180 మంది విద్యార్థులు పరీక్ష రాశారని, 15 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ శర్మ తెలిపారు.
ఆలూరు: పట్టణంలోని మోడల్ కాలేజీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మోడల్ కాలేజీలో 229 మంది విద్యార్థులకు గాను 224 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 240కు గాను 234 మంది వచ్చినట్లు చీఫ్‌లు రాఘవరావు, కృపాకర్ తెలిపారు.

మల్లేపల్లిలో పొలం బడి

వెల్దుర్తి, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లేపల్లిలో శనివారం ఏవో అక్బర్‌బాషా పొలం బడి నిర్వహించారు. శాస్త్రవేత్త ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనిక ఎరువులు విచక్షణారహితంగా వాడద్దని, జొన్న పంటలో పాటించవలసిన వ్యవసాయ పద్దతులను రైతులకు తెలియజేశారు. చైతన్యసాగర్ ఏపీఎస్‌టీపీసీఏ ఇన్‌స్పెక్టర్ , భూమేశ్వర సీఈవో శివశంకర్, పాల్గొన్నారు.

వివక్షను వీడాలి

దేవనకొండ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో వివక్షను వీడాలని తెర్నేకల్ మాజీ సర్పంచ్ రాజన్న, జడ్పీ పాఠశాల హెచ్ఎం కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని తెర్నేకల్ జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కులం, మత, లింగ వివక్షలు లేని సమాజం కోసం కృషి చేయాలన్నారు. సత్యరాజు, చిన్న హనుమంతు, వెంకన్న, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి లోకేశ్


చిన్నారిని ముద్దాడుతున్న నారా లోకేశ్


శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి, మంత్రి


మంచాలమ్మకు హారతి ఇస్తున్న మంత్రి

నారా లోకేశ్‌కు ఘన స్వాగతం

● శ్రీమఠంలో ప్రత్యేక పూజలు ● వేలాదిగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు





మంత్రాలయం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శ్రీ గురు వైభవోత్సవాల్లో తొలి రోజు ముఖ్యఅతిథిగా వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు శ్రీమఠం అధికారులు, నాయకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో మంత్రాలయం జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బి.లక్ష్మన్న, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి సాయిబాబా, టీబీపీ బోర్డు చైర్మన్ టిప్పు సుల్తాన్, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి దివాకర్ రెడ్డి, టీడీపీ నాయకులు రఘునాథరెడ్డి, రామకృష్ణా రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ పన్నగ వెంకటేశ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు అమర్నాథ్ రెడ్డి, రాకేష్ రెడ్డి, చావిడి వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య తదితరులు ఉన్నారు. హెలిప్యాడ్ మైదానం నుంచి రాఘవేంద్రసర్కిల్ మీదుగా మంత్రి శ్రీమఠం వద్దకు చేరుకున్నారు. మఠం ప్రధాన ద్వారం వద్ద ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతాచార్, మేనేజర్, ఈఈ సురేష్ కోనాపూర్, అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్ స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయస్వామిని, శివాలయాన్ని దర్శించుకుని రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేసి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవి, డీటీ గురు రాజరావు, సీఐలు రామాంజులు, శ్రీనివాసులు, మంజునాథ్, ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్, నాయకులు నరవ రమాకాంత్ రెడ్డి, శశిరేఖ, కృష్ణమ్మ, రామిరెడ్డి, ముత్తురెడ్డి, ఉలిగయ్య, చెన్నబసప్ప ఉన్నారు.

వేద పాఠశాల కారిడార్ ప్రారంభం

మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠం ఆధ్వర్యంలో రూ. రెండు కోట్లతో నిర్మించిన గురు సార్వభౌమ సంస్కృత పాఠశాల కారిడార్‌ను పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అక్కడే ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్ర రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, పన్నగ వెంకటేశ్ స్వామి, అమర్నాథ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌తో కలిసి మంత్రి ఆవిష్కరించారు. శ్రీమఠంలో చేపట్టిన అభివృద్ధి పనులను నారా లోకేశ్‌కు పీఠాధిపతి వివరించారు. కార్యక్రమంలో ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేశ్ జోషీ, శ్రీపతిఆచార్, సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్ ఐపీ నరసింహమూర్తి, శ్రీహరి, హరినాథ్, రాజా ఎస్ అప్రమేయాచార్, డోన్ రాఘవేంద్రాచార్, వాధిరాజాచార్, వ్యాసరాజాచార్, దేశాయ్ నరసింహాచార్, రవి కులకర్ణి, విజయేంద్రాచార్, అనంతపురాణిక్, జేపీ స్వామి పాల్గొన్నారు.




వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందిస్తున్న కలెక్టర్


మంత్రి నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కర్నూలు ఎస్పీ


స్వాగతం పలుకుతున్న తిక్కారెడ్డి, బీటీ నాయుడు, బస్తిపాటి

నారా లోకేశ్‌కు వినతుల వెల్లువ

మంత్రాలయం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పర్యటనకు వచ్చిన ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నాయకులు, ప్రజా సంఘాలు, కుల సంఘాల నాయకులు వినతి పత్రాలు అందజేశారు. శనివారం హెలిప్యాడ్ మైదానంలో బార్ అసోసియేషన్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, రైతు సంఘం, సీపీఐ, సీపీఎం, జైభీమ్, ఎమ్మార్పీఎస్, కేవీపీఎస్, వాల్మీకి సంఘాలు, వీరశైవ లింగాయతలు, దివ్యాంగులు తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రాలు అందజేశారు. మెగా డీఎస్సీ, మంత్రాలయంలో వందపడకల ఆసుపత్రి, మంత్రాలయంలో మెజిస్ట్రేట్ కోర్టు, హైకోర్టు బెంచ్, వాల్మీకుల ఎస్టీ బిల్లు, దివ్యాంగుల సమస్యల పరిష్కారం, కుల వివక్షత, రైతుల సమస్యలు వంటి అంశాలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ వారికి సానుకూలంగా స్పందించి అందరికీ న్యాయం చేసే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

సమస్యలు పరిష్కరించాలి

పెద్దకడుబూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని సమస్యలు పరిష్కరించాలని టీడీపీ రైతు సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంతరెడ్డి మంత్రి నారాలోకేష్‌ను శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. బైచిగేరి నుంచి పెద్దకడుబూరు, మాలపల్లి నుంచి ఎమ్మిగనూరు వరకు, ఈర్లపాడు రోడ్లను వేయాలన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీకి అనుమతులు ఇవ్వాలని, ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. హనుమాపురం కొట్టాలకు పట్టాలు అందజేయాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించి, సచివాలయం, రైతు భరోసా భవనాల నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు.


నారా లోకేశ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

వీరశైవలింగాయత్‌లను ఓబీసీలో చేర్చాలి

ఎమ్మిగనూరు, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వీరశైవలింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వీరశైవలింగాయత్ సంఘం నాయకులు నాగరాజుగౌడు, నటరాజ్, చంద్రశేఖర్‌గౌడు, టైలర్ పరమేష్, మహేష్, బసవరాజు, ఈరన్నలు కోరారు. శనివారం మంత్రాలయానికి వచ్చిన మంత్రి నారాలోకేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీరశైవలింగాయత్, లింగబలిజలను బీసీ జాబితాలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చేర్పించినప్పటికి కేంద్ర ప్రభుత్వం ఓబీసీ జాబితాలో చేర్చలేదన్నారు. దీంతో ఆయా కేటగిరిలకు చెందిన అభ్యర్థులు విద్య, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఓబీసీ జాబితాలో చేర్పించాలని కోరారు.

ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం దారుణం

ఎమ్మిగనూరు రూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం దారుణమని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం నాయకుడు భాస్కర్ యాదవ్ విమర్శించారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కర్నూలు జిల్లాలో ఆర్డీఎస్, వేదావతి, గుండ్రేవుల సాగునీటి ప్రాజెక్టులకు నిధులను కేటాయించకుండా విస్మరించడం సరికాదన్నారు. కరువు ప్రాంతంగా ఉన్న రాయలసీమను అభివృద్ధి చేయాల్సిందిపోయి ప్రాజెక్టుల నిధుల మంజూరుకు కూటమి ప్రభుత్వం మొండిచేయి చూపించిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి రైతులకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో మల్లికార్జున గౌడు, నరసింహులు, నాగరాజు, రవి పాల్గొన్నారు.

గురుజాలలో ముగిసిన పూజలు


పూజలు చేస్తున్న ఆలయ అర్చకులు

నందవరం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గురుజాల రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి పూజలు శనివారం ముగిశాయి. చివరి రోజు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 1వరకు ఆలయంలో ప్రత్యేకంగా మహా శివరాత్రి వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు హంపీస్వామి అంకురార్పణ, మహాసంప్రోక్షణ, యాగమండప ప్రవేశం, స్వామివార్లకు కలశపూజ, ఆకుపూజ చేశారు. అమ్మవార్ల వసంతోత్సవం నిర్వహించారు. ఆలయంలో ఎండోమెంట్ అధికారి రాంప్రసాద్, టీడీపీ నాయకులు శివారెడ్డి పాల్గొన్నారు.

వాట్సాప్ సేవలను వినియోగించుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వాట్సాప్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ గంగిరెడ్డి కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన వాట్సాప్ నెంబరు 9552300009 ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరవేయాలని నిర్ణయించిందన్నారు. అందుకు అనుగుణంగా 32 రకాల పురపాలక సేవలు అందుబాటులోకి తెచ్చారన్నారు. ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకొని తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు.

పాఠశాలలో సరస్వతి పూజ

కోసిగి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని డి.బెళగల్ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో శనివారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జియోన్ కుమారి అధ్యక్షతన పదవ తరగతి విద్యార్థులు సరస్వతీ పూజ చేశారు. అనంతరం పాఠశాలలో 50మంది విద్యార్థులకు టీడీపీ గ్రామ నాయకులు మాల బసవ లింగప్ప పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రభాకర్ రెడ్డి, రామయ్య, హంశేనీ, రాజశేఖర్ రెడ్డి, నాగరాజు, పాఠశాల చైర్మన్ తిక్కప్ప తదితరులున్నారు.

మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కాలేదు

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా జరిగిన పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగాలు వృథాకాలేదని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మహదేవ్ అన్నారు. వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన వారి చిత్రపటాలకు శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరుల త్యాగాలకు గుర్తుగా హైదరాబాద్, అమరావతిలో స్థూపం నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రతి మార్చి 1న మాదిగ అమర వీరుల దినోత్సవం నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నాయకులు నరసింహులు, సోమన్న, మునిస్వామి, ఎల్లప్ప, సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుకు ఎస్సీ బాలుర హాస్టల్ మంజూరు


మాట్లాడుతున్న టీఎన్ఎస్ఎఫ్ నాయకులు

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరుకు ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి దక్కుతుందని టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ నాయకులు నాగరాజు, బోగ్గు రమేష్‌నాయుడు అన్నారు. శనివారం గోనెగండ్లలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడారు. ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఎస్సీ బాలుర హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారని, గత ప్రభుత్వంలో ఎన్నిమార్లు అధికారులకు నాయకులకు విన్నవించిన ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి సమస్యలను వివరించగా వెంటనే స్పందించి ఎమ్మిగనూరుకు ఎస్సీ బాలుర హాస్టల్‌ను మంజూరు చేయించారన్నారు. దీంతో నియోజయవర్గంలోని ఎస్సీ విద్యార్థుల, టీడీపీ నాయకుల తరుపున ఎమ్మెల్యే బీవీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాంపురం రఫిక్, జిలాని, బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలస వెళ్లొద్దు: ఎంపీడీవో

నందవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): కూలీలు వలస వెళ్లొద్దని ఎంపీడీవో పుల్లయ్య సూచించారు. శనివారం నందవరంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఫారం పాండ్స్ వర్క్‌కు సంబంధించిన మస్టర్లను తనిఖీ చేశారు. కూలీలు కొలతల ప్రకారం పని చేసి రూ. 300 రోజు కూలి తీసుకోవాలని సూచించారు. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, టీఏలు, మేటీలు పాల్గొన్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి


సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): టీడీపీతోనే గ్రామాభివృద్ధి సాధ్యమని పార్టీ మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, ప్రధానకార్యదర్శి తిరుపతయ్యానాయుడు అన్నారు. శనివారం కులుమాల గ్రామం బీసీ కాలనీలో రూ.15 లక్షల నిధులతో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో గ్రామాలు అభివృద్ధి పథంలో నడుస్తున్నాయని ఇప్పటికి మూడు కోట్లు రూపాయలతో మండలంలో సీసీరోడ్డు, డ్రైనేజీ పనులు చేశామన్నారు. గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తిమ్మారెడ్డి, రాజేష్, చాంద్‌బాషా, బుడ్డన్న, బాషా, మోహన్‌రెడ్డి, దేవవరం, నాగన్న, హరికృష్ణ, వెంకటేష్, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వీవర్స్‌శాల ఏర్పాటుకు కృషి

● అర్హులైన వారందరికీ పింఛన్లు
● సీసీ రోడ్ల ఏర్పాటుకు చర్యలు
● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి


వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, మార్చి1(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో చేనేత కార్మికుల కోసం రూ.కోటితో వీవర్స్‌శాల ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం ఎన్టీఆర్ సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు డబ్బులు అందజేశారు. అలాగే స్థానికంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు యాదవ్, కమిషనర్ గంగిరెడ్డి, కౌన్సిలర్ రాందాసుగౌడు, టీడీపీ నాయకులు చేనేత మల్లి, వెంకటేష్‌రాజు, మహేష్, కనికె నాగరాజు, మిన్నప్ప, రంగస్వామినాయుడు, గాజుల సుధాకర్, ఆర్టీసి అల్తాఫ్, జగదీష్, ఇద్రుష్‌స్వామి, లు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడి మృతి బాధాకరం

పట్టణంలోని యల్లంబీడు ప్రాంతంలో నివసిస్తున్న చేనేత కార్మికుడు మాదుగుండు రాజన్న ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అన్నారు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తరపున ఆదెన్న కుటుంబానికి రూ.1.50లక్షల ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులకు ఏ ఇబ్బందులు వచ్చినా టీడీపీ అండగా నిలుస్తుందన్నారు. ఆయన వెంట టీడీపీ చేనేత విభాగం నాయకులు దేవేంద్ర, మిన్నప్ప, చేనేత మల్లి పాల్గొన్నారు.

అత్యద్భుతమైన బడ్జెట్: ఎమ్మెల్యే బీవీ

అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెట్టిన బడ్జెట్ అత్యంత అద్భుతమైన బడ్జెట్ అని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఆయన ఎమ్మిగనూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీ, ఎస్సీ ఎస్టీ, మైనార్టీలతో పాటు పేదలందరికీ, అన్ని వర్గాలకు ఉపయోగపడే బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. అన్ని రంగాలకు ప్రాధాన్యతను ఇస్తూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతున్నారన్నారు. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో ఎమ్మిగనూరు అభివృద్ధికి కూడా స్థానం దక్కిందన్నారు. ఈ నిధులతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు మహర్దశ

- జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ


మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సర్వేతో చిన్న, మధ్యతరహా, సూక్ష్మతరహా పరిశ్రమలకు మహర్దశ అని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ అన్నారు. సర్వేకి సహకరించాలని కోరారు. శనివారం గోనెగండ్లలోని ఎంపీడీవో కార్యాయలంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వ్యాపారాలకు సంబంధించిన ప్రతి షాపు, పరిశ్రమల పూర్తి వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తున్నామని తెలిపారు. సర్వే ఈ నెల 15వరకు కొనసాగుతుందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 56శాతం మాత్రమే జరిగిందని గోనెగండ్ల మండలంలో 30 శాతం పూర్తి అయిందన్నారు. ఈ నెల 15వ తేది లోపు సర్వేను పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పరిశ్రమల వివరాలు సేకరించే సచివాలయ ఉద్యోగులకు పరిశ్రమదారులు సహకరించాలని కోరారు. ఈ సర్వే కారణంగా పరిశ్రమలకు ఉద్యమ్ గుర్తుంపు సంఖ్య జారీ చేస్తామని, బ్యాంక్ నుంచి రుణాలు కూడా త్వరగా అందుతాయని, మార్కెటింగ్ ఈ కామర్స్ ద్వారా వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు వీలు కలుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలలో జరిగే టెండర్స్‌కు సంబంధించిన ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుందని, ఇది వ్యాపారులకు ఎంతో మేలు కలుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో మణిమంజరి, కార్యదర్శి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు


ఎమ్మిగనూరులో హాల్ టికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ మహిళ జూనియర్ కళాశాల, వైష్ణవి డిగ్రీ కాలేజీ, నలందా కాలేజీ, గ్లోబల్ ఇంటర్ కాలేజీ, నారాయణ జూనియర్ కాలేజీ సెంటర్లల్లో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. సెంటర్ల దగ్గరకు విద్యార్థులు ఉదయం 8:30గంటలకే తమ తల్లిదండ్రులతో వచ్చి తమ హాల్‌టిక్కెట్ నంబర్లు చూసుకున్నారు. విద్యార్థుల సామగ్రి పెట్టేందుకు ప్రత్యేక కౌంటర్లు లేకపోవడంతో విద్యార్థులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

గోనెగండ్ల: మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు నిర్వహించారు. 267మందికి గాను 261 మంది విద్యార్థులు హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతంలో 144 సెక్షన్‌ను పోలీసులు విధించారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలి


గోనెగండ్లలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

గోనెగండ్ల, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కాటికాపరులను నాలుగో తరగతి ఉద్యోగులుగా పరిగణించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల దగ్గర మండల కాటికాపరులు, శ్మశానం లోగుంతలు తీసే వారి సంఘం నాయకులు కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీవో మణిమంజరికి వినతి పత్రాలను అందజేశారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ కాటికాపరులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుర్భర జీవితం గడుపుతున్న వీరిని నాల్గోతరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. అర్హులకు రూ.8వేలు పింఛన్, రెండు ఎకరాల పంటభూమి, మూడు సెంట్ల స్థలం ఇచ్చి ఇల్లు కట్టించాలని కోరారు. వీరి వృత్తిలో కావాల్సిన వస్తువులు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కన్నయ్య, తాయప్ప, మల్లికార్జున, శంకర్, వెంకటేష్, పేతూరయ్య, లక్ష్మన్న, నాగరాజు గోనెగండ్ల, ఎర్రబాడు, ఒంటెడుదిన్నె, అగ్రహరం గ్రామాల కటికాపారులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన కలెక్టర్


మంత్రాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు

మంత్రాలయం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన మంత్రాలయంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పింఛన్లను కలెక్టర్ రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పంపిణీ చేశారు. శనివారం మంత్రి నారా లోకేశ్ పర్యటనలో భాగంగా ఉదయం మంత్రాలయం ఈవోఆర్డీ ప్రభావతిదేవి, గ్రామ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో చివాలయ సిబ్బందితో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరదరాజులు, శివ, అశోక్ రెడ్డి, నరసింహులు, కంసాలి నరసింహాచార్, ఎంపీటీసీ మేకల వెంకటేశ్, మేకల నరసింహులు పాల్గొన్నారు.

హెచ్‌బీఎస్ కాలనీలో చోరీ

ఎమ్మిగనూరు టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హెచ్‌బీఎస్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్రాంత వ్యవసాయ అధికారి మేఘనాథ్ హెచ్‌బీఎస్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఐదు రోజుల క్రితం వైద్య చికిత్స నిమిత్తం చెన్నైకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. అయితే ఇంటి పనిమనిషి సాయంత్రం ఇంటికి రాగా అప్పటికే తాళాలు పగలగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో విషయాన్ని ఇంటి యజమానులకు తెలిపింది. అలాగే వారు బంధువు నీలకంఠకు సమాచారం ఇవ్వగా, ఆయన ఇంటికి వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి పోలీసులు చేరుకొని పరిశీలించారు. ఇంటి యజమానులు వచ్చి ఫిర్యాదు చేస్తే పూర్తి వివరాలతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతామని పోలీసులు తెలిపారు.